మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 24-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 264 Issue: 264

Published from Jagitial
Circulated to Telangana

24 మార్చి 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:20 సూర్యాస్తమయం - సా. 6:24 తిథి షష్ఠి సా. 4:10 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం రోహిణి రా. 7:05 వరకు తరువాత మృగశిర యోగం ప్రీతి ఉ. 9:07 వరకు కరణం తైతుల సా. 4:10 వరకు గరజి రా. 2:590 వరకు వర్జ్యం ఉ. 11:39 నుండి మ. 1:08 వరకు దుర్ముహూర్తం ఉ. 8:45 నుండి ఉ. 9:33 వరకు రా. 11:10 నుండి రా. 11:58 వరకు రాహుకాలం మ. 3:23 నుండి సా. 4:53 వరకు యమగండం ఉ. 9:21 నుండి ఉ. 10:52 వరకు గుళికాకాలం మ. 12:22 నుండి మ. 1:53 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:44 నుండి తె. 5:32 వరకు అమృత ఘడియలు సా. 4:06 నుండి సా. 5:35 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:58 నుండి మ. 12:46 వరకు



## బంగారం దిగింది!

### ఒక్క రోజే రూ.10 వేలు డౌన్

హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): 18 క్యారెట్ బంగారం కూడా రూ.7,740 తగ్గి రూ.1,09, 480 నుంచి రూ.1,01, 740కి చేరింది. జనవరి 29న బంగారం ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఆ రోజుతో పోలిస్తే ఇప్పుడు చాలా తగ్గాయి. అప్పట్లో 24 క్యారట్ బంగారం రూ.1,78,850 తరువాయి 2 వ పేజీలో...

బంగారం ధర సోమవారం ఏకంగా రూ.10 వేల వరకు తగ్గింది. 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు రూ.10,320 తగ్గి రూ.1,45,970 నుంచి రూ.1,35,650కి వచ్చింది. 22 క్యారట్ బంగారం (ఆభరణాలకు ఎక్కువగా వాడేది) రూ.7,560 తగ్గి రూ.1,33,800 నుంచి రూ.1,24,350కి పడింది.

## చమురు వదిలింది

### 13 శాతం తగ్గిన ధరలు

ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను ఐదురోజుల పాటు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ వాయిదా వేయడంతో ముడి చమురు ధరలు సగటున 13 శాతం మేర తగ్గాయి. ఇరాన్‌కు చెందిన ఇంధన వసతులపై దాడులను ఐదు రోజుల పాటు ఆపాలని అమెరికా రక్షణ శాఖకు నిర్దేశించానని ట్రంప్ ప్రకటించారు.

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పూర్తిస్థాయిలో తగ్గించే పరిష్కారం దిశగా సంప్రదింపులు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. దీంతో అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్‌కు ప్రామాణికమైన -2 వ పేజీలో...



# నచ్చావయ్యా రేవంతు!

## తల్లిదండ్రుల సంరక్షణకు వినూత్న బిల్లు

### కన్నోళ్లను పట్టించుకోకపోతే జీతం కట్.. మానవీయ బిల్లుకు రాష్ట్ర కేబినెట్ ఓకే

### గిగ్ వర్కర్ల సంక్షేమానికీ హామీ బిల్లు..పలు కీలక బిల్లులకు మంత్రివర్గం ఆమోదం



సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం సమావేశమైన తెలంగాణ మంత్రి వర్గం.. పలు కీలక బిల్లులను ఆమోదిం చింది. రాష్ట్రంలో సామాజిక భద్రత, శాంతి భద్రతలను పరిరక్షించడమే లక్ష్యంగా కొన్ని బిల్లులకు ఆమోదం తెలిపింది. తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత కుమారులకు ఉంటుందని.. అలా చూసుకోని వారికి వారి జీతాల్లో నుంచి కొంత మొత్తాన్ని తీసి.. వారి తల్లిదండ్రులకు ఇవ్వనున్నట్లు ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి చెప్పగా, దానికి సంబంధించిన బిల్లుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): వయసు మీదపడి వృద్ధాప్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రుల బాధ్యతను తీసుకోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతోపాటు.. ప్రజాప్రతినిధుల వేతనాల నుంచి 15 శాతం లేదా రూ.10 వేలను.. ఇందులో ఏది తక్కువగా ఉంటే అది కట్ చేసి.. వాటిని నేరుగా తల్లిదండ్రులకు అందించేందుకు ఉద్దేశించిన బిల్లును రూపొందించగా.. తాజాగా అది కేబినెట్ ఆమోదం పొందింది.

#### గిగ్ వర్కర్ల సంక్షేమానికి హామీ

తెలంగాణలో సుమారు 4.2 లక్షల మంది గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ కార్మికులు (డెలివరీ బాయ్స్, డ్రైవర్లు) ఉన్నారు. ఈ గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ యాక్ట్ 2026ను -2 వ పేజీలో...



# యుద్ధమైనా తగ్గలే!

### భారత వృద్ధి అంతకంతకు పైకి

### గత 23 రోజుల్లో కీలక నిర్ణయాలు

### దేశానికి క్షేమంగా 3.75 లక్షల మంది

### 41 దేశాల నుంచి చమురు, ఎరువులు

### లోక్‌సభలో ప్రకటించిన ప్రధాని మోదీ


ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణంచ ఉద్రిక్తతలు ఉన్నా వృద్ధి వేగంలో భారత్ తగ్గలేదని ప్రధాని మోదీ అన్నారు. గత 23 రోజుల్లోనే ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని, ఇది దేశాభివృద్ధి పట్ల తమకున్న నిబద్ధతను చాటుతోందని చెప్పారు. పండుగ సెలవుల తర్వాత పార్లమెంటు ఉభయ సభలు సోమవారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పశ్చిమాసియాలోని ప్రస్తుత పరిస్థితిపై ప్రధాని మోదీ లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు.

న్యూఢిల్లీ: ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి 3.75 లక్షల మందికి పైగా భారతీయులు క్షేమంగా దేశానికి తీసుకొచ్చామని ప్రధాని మోదీ అన్నారు. ఒక్క ఇరాన్ నుంచే సుమారు 1,000 మంది భారతీయులు తిరిగి వచ్చారని తెలిపారు. అలాగే గల్ఫ్ దేశాలలో, కోటిమందికి పైగా నివసిస్తున్నారు. వారి కోసం 24/7 కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. ఈ సంక్షోభ సమయంలో విదేశాలలో ఉన్న భారతీయుల భద్రతకే అత్యంత ప్రాధాన్యమిచ్చినట్టు ప్రధాని స్పష్టం చేశారు. గృహ అవసరాల ఎల్‌పీజీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, దేశీయంగా వంట గ్యాస్ ఉత్పత్తిని పెంచామని మోదీ స్పష్టం చేశారు. హార్మోజ్ జల సంధిలో ఇరుక్కున్న భారత్ నౌకలను సురక్షితంగా తీసుకు వచ్చామని మోదీ తెలిపారు. 41 దేశాల తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,565 |
| వెండి (గ్రాము): | రూ.230 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,434 |

# యుద్ధానికి బ్రేక్ ఇస్తున్నాం



### దాడులను 5 రోజులు వాయిదా వేస్తున్నాం

### ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయ్

### దాడులు ఆపాలని సైన్యాన్ని ఆదేశించా

### అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

గత కొన్ని వారాలుగా ప్రపంచాన్ని వణికిస్తున్న ఇరాన్-అమెరికా యుద్ధ మేఘాలకు బ్రేక్ పడింది. పశ్చిమ ఆసియాలో ఇరు దేశాలు భీకర దాడులతో విరుచుకుపడుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌తో కొనసాగుతున్న పోరుకు ఐదు రోజుల పాటు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం అంతర్జాతీయ సమాజంలో పెను సంచలనంగా మారింది.

టెహ్రాన్/వాషింగ్టన్/జెరూసలేం: హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ ఇరాన్‌కు విధించిన 48 గంటల గడువుపై ట్రంప్ వెనక్కి తగ్గారు. ఇజ్రాయిల్ విద్యుత్ కేంద్రాలు, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలకు విద్యుత్ సరఫరా చేసే కేంద్రాలపై దాడులు చేపడతామని ఇరాన్ హెచ్చరించడంతో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇతర ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయనున్నట్లు అమెరికా సోమవారం ప్రకటించింది. 'మధ్యప్రాచ్యంలో మన మధ్య ఉన్న శత్రుత్వాలకు పూర్తి పరిష్కారంపై గత రెండు రోజులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇరాన్ మధ్య చాలా మంచి ఫలవంతమైన చర్చలు జరిగాయని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. లోతైన, విశ్లేషణాత్మక, నిర్మాణాత్మక చర్యలు ఈ వారంలో కూడా కొనసాగుతాయి. కొనసాగుతున్న సమావేశాలు, చర్చలు విజయవంతం తరువాయి 2 వ పేజీలో...



# ట్రంప్ భయపడ్డాడు!

## ఎలాంటి చర్చలు జరగలేదు

### అమెరికా అధ్యక్షుడి కుట్రలు తెల్సు... ట్రంప్ ప్రకటనపై ఇరాన్ కౌంటర్

పశ్చిమాసియాలో ఇరాన్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై టెహ్రాన్ స్పందించింది. తమ దాడులకు ట్రంప్ భయపడ్డారని, అమెరికా, ఇజ్రాయెల్‌లు చిత్తుగా ఓడిపోయాయని ఇరాన్ ఎద్దేవా చేసింది. అయితే, అమెరికాతో ఎలాంటి చర్చలు జరగడం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రకటించింది.

టెహ్రాన్: సమయం చూసి మళ్లీ తమపై దాడులు చేసేందుకే ట్రంప్ ప్లాన్ చేశారని, ఆయన నమ్మబోమని ఇస్లామిక్ రిపబ్లిక్ తేల్చిచెప్పింది. చర్చల విషయంలో ఎవరూ మధ్యవర్తిత్వం వహించడం లేదని, అమెరికాతో ఎలాంటి చర్చలు జరగడం లేదని -2 వ పేజీలో...

## విశ్వవాణి



ఒకసారి లాటరీ గెలవడం అంటేనే చాలా గొప్ప. అలాంటిది నాలుగు సార్లు గెలవడం అంటే? అంతకుమించి అదృష్టం ఇంకేమైనా ఉంటుందా? అని మనం అనుకుంటాం. కానీ, అదృష్టం కాదు.. అవి నా తెలివి తేటలు అంటోంది జాన్ జింథర్. అమెరికాకు చెందిన ఈమె గణితంలో పీహెచ్‌డీ చేసింది. స్క్రాచ్ కార్డు తరహా లాటరీల్లో ఉపయోగించే అల్గారిథంను గుర్తించిన జాన్.. తన బుర్రకు పదును పెట్టి లాటరీ గెలిచింది. అయితే, ఆ అల్గారిథంపై పూర్తి సమాచారం మనకు తెలియరాలేదు.



## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

ముంబై: అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. సోమవారం ట్రేడింగ్‌లో అమ్మకాల సునామీ వెల్లువెత్తడంతో ఇన్వెస్టర్లు తీవ్రంగా నష్టపోయారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా సూచీలు భారీ పతనాన్ని నమోదు చేశాయి. ఈ భారీ తరువాయి 2 వ పేజీలో...



## కార్ల ధరలు రయ్ రయ్

కొత్త కారు కొనేవారికి తయారీ కంపెనీలు షాక్ ఇస్తున్నాయి. పశ్చిమాసియాలో ముదిరిన ఉద్రిక్తతల కారణంగా ముడి పదార్థాల ధరలు విపరీతంగా పెరగడంతో, అనేక కార్ల తయారీ సంస్థలు కార్ల ధరలను పెంచాయి.

న్యూఢిల్లీ: వీటిలో దేశీయ తయారీ దిగ్గజం టాటా మోటార్స్‌తో పాటు లగ్జరీ కార్ల బ్రాండ్ బీఎండబ్ల్యు, మెర్సిడెస్ బెంజ్, ఆడి ఇండియా కూడా ఉన్నాయి. మారుతీ సుజుకి కూడా పెంపును సమీక్షిస్తున్నట్టు సమాచారం. కంపెనీలన్నీ సవరించిన ధరలను ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకురానున్నాయి. టాటా మోటార్స్ అన్ని కార్లపైనా 0.5 శాతం మేర పెంచాలని తరువాయి 2 వ పేజీలో...




## కోకాకోలా కోయ్ కోయ్

న్యూఢిల్లీ: కోకా కోలా ఉత్పత్తులను బాటిలింగ్ చేసే ప్రధాన సంస్థ ఎస్ఎల్ఎంజీ బేవరేజెస్ త్వరలో కొన్ని ఉత్పత్తుల ధరలను పెంచే అవకాశం ఉందని సమాచారం. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా ప్యాకేజింగ్ ఖర్చులు పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకునే పరిస్థితి ఏర్పడింది. కంపెనీ డిప్యూటీ సీఈఓ రాహుల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉత్పత్తి ఖర్చులు ఒత్తిడిలో ఉన్నాయని తెలిపారు. యుద్ధం కొనసాగితే ప్లాస్టిక్ తరువాయి 2 వ పేజీలో...



## దానంకు తప్పని తిప్పలు

### పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు నోటీసునలు

హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఇటీవల అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

24.3.2026

మేషం: కుటుంబమున కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి. సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. అన్ని రంగాల వారికి పరిస్థితులు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ విలువ మరింత పెరుగుతుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారమున అంచనాలు అందుకుంటారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది.

వృషభం: ఆర్థిక పరంగా ఇబ్బందులు తప్పవు. దూరప్రయాణ సూచనలున్నవి. బంధు మిత్రులతో మాట పట్టింపులుంటాయి. కొన్ని వ్యవహారాలలో ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగమున ఇతరులతో వాదనకు వెళ్ళకపోవడం మంచిది.

మిధునం: వ్యాపార విషయమై కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆప్తుల నుండి విలువైన సమాచారం అందుతుంది. వృత్తి, ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి ఆర్థిక పరంగా అనుకూలత పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో వివాదాలు సర్దుమణుగుతాయి .చాలా కాలంగా పూర్తికాని పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

కర్కాటకం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత అధికమౌతుంది. సన్నిహితులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. సోదరులతో కొన్ని వ్యవహారాలలో సఖ్యత లోపిస్తుంది.కుటుంబ విషయమై స్థిరమైన నిర్ణయాలు చెయ్యలేరు. స్థిరాస్తి ఒప్పందాలు కలిసిరావు. నిరుద్యోగుల ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

సింహం: ఊహించని ప్రయాణాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం వలన మానసిక సమస్యలు కలుగుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. దైవచింతన పెరుగుతుంది.

కన్య: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. చాలాకాలంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారం అవుతాయి. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపార వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

తుల: అవసరానికి చేతిలో డబ్బు నిలువ ఉండదు. ఇంటాబయట ఊహించని సమస్యలు కలుగుతాయి. ఒక వ్యవహారంలో జీవిత భాగస్వామితో మాటపట్టింపులు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. విద్యార్థులు పోటీ పరీక్ష ఫలితాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

వృశ్చికం: వృత్తి ఉద్యోగమున చెయ్యని పనికి ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. దూర ప్రయాణ విషయంలో వాహన ఇబ్బందులుంటాయి. ఆదాయ మార్గాలు అంతంత మాత్రంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణ యత్నాలు చేస్తారు.

ధనస్సు: బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. ముఖ్యమైన పనులు వాయిదా వెయ్యడం మంచిది. కుటుంబ పెద్దల నుండి కొంత ప్రతికూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

మకరం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది. స్థిరాస్తి వివాదాలను సోదరుల సహాయంతో రాజీ చేసుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలు మరింత అభివృద్ధి బాటలో సాగుతాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. కుటుంబ సభ్యుల మధ్య శుభకార్య ప్రస్తావన వస్తుంది. వ్యాపారాలలో నూతన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నిరుద్యోగులకు సన్నిహితుల సహాయ సహకారాలతో నూతన ఉద్యోగ లబ్ది పొందుతారు.

మీనం: కొన్ని వ్యవహారాలలో ఇతరుల నుండి సమస్యలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో కొంత ప్రతికూల వాతావరణం ఉంటుంది. దూర ప్రయాణాలు వ్యర్థంగా ఉంటాయి. ఖర్చులు ఆదాయానికి మించి ఉంటాయి. ఉద్యోగమున అధికారులతో వాదనలకు వెళ్లకపోవడం మంచిది. నేత్ర సంభందమైన అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

# నచ్చావయ్యా రేవంతు!

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణ మంత్రివర్గం ఆమోదించింది. దీని ప్రకారం గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్‌తోపాటు ఒక ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయనున్నారు. ఇలా చేయడం వల్ల గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపుతో పాటు సామాజిక భద్రత కూడా లభిస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడేందుకు.. అదే సమయంలో సోషల్ మీడియాలో పెరిగిపోతున్న విద్వేషపూరిత, రెచ్చగొట్టే పోస్టులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన బిల్లును తీసుకువచ్చింది. తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు 2026ను తాజాగా తెలంగాణ కేబినెట్ ఆమోదించింది. విద్వేషపూరితమైన ప్రసంగాలు.. అల్లర్లను ప్రేరేపించే విధంగా చేసే వ్యాఖ్యలను కట్టడి చేసేందుకు ఈ బిల్లు ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేయనుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మతాల మధ్య కొంతమంది చిచ్చు పెట్టేందుకు చేసే ప్రయత్నాలను అడ్డుకోవడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని తెలిపాయి.

హైదరాబాద్‌లోని 69 కిలోమీటర్ల ఫేజ్-1 మెట్రో వ్యవస్థను ఎల్ అండ్ టీ సంస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుంది. దీని కోసం రూ.15 వేల కోట్లను చెల్లించాలని సర్కార్ నిర్ణయించింది. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు నోడల్ ఏజెన్సీగా హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్)ను నియమించింది.

### న్యాయవాదుల రక్షణకు బిల్లు

రాష్ట్రంలో లాయర్లపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును తీసుకువచ్చిన ప్రభుత్వం.. తాజాగా దానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణలో సంచలనం సృష్టించిన హైకోర్టు న్యాయవాదులు వామనరావు దంపతుల హత్య వంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఉండేందుకు న్యాయవాదులకు తగిన భద్రత కల్పించడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. ఇక, రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ ఇచ్చిన రిపోర్టును రాష్ట్ర మంత్రివర్గం పరిశీలించింది. అదే సమయంలో విద్యాసంస్థల్లో కుల వివక్షను నివారించేందుకు రోహిత్ వేముల చట్టానికి సంబంధించిన విధివిధానాల రూపకల్పన కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.



# యుద్ధమైనా తగ్గలే!

**మొదటి పేజీ తరువాయి**

నుంచి చమురు, గ్యాస్, ఫర్టిలైజర్స్ తెప్పిస్తున్నామని, సురక్షిత నౌకా మార్గాలపై దృష్టిసారించామన్నారు. 53 లక్షల మెట్రిక్ టన్నుల ఇంధనం రిజర్వుగా ఉందని ఈ సందర్భంగా మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. హర్మూజ్ జలసంధి ద్వారా గ్యాస్, క్రూడాయిల్ సరఫరా ఇబ్బందిగా మారింది. అయితే ఇంధన సమస్యలను అధిగమించేందుకు తమ ప్రభుత్వ కృషి చేస్తోందని మోదీ వెల్లడించారు. సాధ్యమైన ప్రతి చోటి నుంచీ చమురు, గ్యాస్ సరఫరాలను సేకరించ డానికి భారత్ ప్రయత్నిస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. చమురు, గ్యాస్, ఎరువుల సరఫరాకు అంతరాయం లేకుండా కేంద్రం అన్ని రకాలుగా కృషి చేస్తోందన్నారు. బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టేలా కఠిన చర్యలు తీసు కోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని మోదీ సూచించారు. యుద్ధం ముగించి,శాంతిని నెలకొల్పాలని కోరుతున్నాని మోదీ తెలిపారు. శాంతియుత సమాధానాన్ని తీసుకొచ్చేందుకు అందరు ప్రయత్నించాలని, దౌత్య, చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. యుద్ధం పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశామనీ, గల్ఫ్ దేశాధినేతలతో స్వయంగా మాట్లాడినట్టు మోదీ వెల్లడించారు. చమురు,మౌలిక వసతుల ప్రాజెక్టులపై దాడులను ఖండించామ□న్నారు. అలాగే ఈ సంక్షోభ పరిస్థితులను దుర్వినియోగం చేసే శక్తులపై చర్యలు తీసుకునేందుకు భద్రత బలగాలను అప్రమత్తం చేశామన్నారు. ఈ యుద్ధం వల్ల అనేక దుష్ప్రభావాలు ఉండే అవకాశం ఉంది. అందుకే దీన్ని గట్టిగా ఎదుర్కొనేందుకు అందరం ఐకమత్యంగా ఉండాలని మోదీ పిలుపునిచ్చారు.

### ప్రధాని మోదీ ప్రసంగంలో కీలకాంశాలు:

- ప్రపంచ సంక్షోభాల భారం రైతులపై పడకుండా, ఎరువుల కోసం ఏర్పాట్లు చేశాం.
- కీలకమైన ముడిసరుకుల విషయంలో నిల్వలను పెంచుకుంది.
- యుద్ధం, భారతదేశంలో వేసవి ఉష్ణోగ్రతల కారణంగా దేశంలో విద్యుత్ అవసరం పెరుగుతుంది.
- ప్రస్తుతం, దేశంలోని అన్ని విద్యుత్ ప్లాంట్లలో తగినంత బొగ్గు నిల్వలు ఉన్నాయి.
- వరుసగా రెండో ఏడాది కూడా ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని నమోదు చేసింది.
- విద్యుత్ ఉత్పత్తి నుంచి సరఫరా వరకు అన్ని వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.
- మన పునరుత్పాదక బొగ్గు శక్తి 140 గిగావాట్లుగా ఉంది.
- గోవర్ధన్ యోజన కింద 40 లక్షలకు పైగా ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశాం.
- ఈ యుద్ధ ప్రభావం దీర్ఘకాలికంగా ఉంటుంది.
- కోవిడ్ లాంటి సంక్షోభం, దీన్నిఅధిగమించడానికి దేశం మరోసారి ఏకం కావాలి.
- గతంలో కూడా ఇలాంటి సవాళ్లను ఎదుర్కొన్నాం. ఎప్పటిలాగానే ఐక్యంగా ఉండాలి.

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

**మొదటి పేజీ తరువాయి**

పతనం ఫలితంగా బీఎస్ఈ సెన్సెక్స్ 1,836.57 పాయింట్లు నష్టపోయి 72,696.39 వద్ద ముగిసింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 601.85 పాయింట్లు కోల్పోయి 22,512.65 వద్ద స్థిరపడింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాలే ఈ పతనానికి ప్రధాన కారణంగా నిలిచాయి. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవకపోతే తీవ్ర చర్యలు తప్పవని ఇరాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీనికి ప్రతిగా మధ్యప్రాచ్యంలోని ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ బెదిరించింది. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 2.37 శాతం పెరిగి 108.73 డాలర్లకు చేరింది. ఈ ఆందోళనలతో మార్కెట్లలో అస్థిరత తీవ్ర స్థాయికి చేరింది. ఇండియా వీఐఎక్స్ సూచీ ఏకంగా 17 శాతానికి పైగా ఎగబాకి 26.73 వద్ద ముగిసింది. బెంచ్‌మార్క్ సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లలో నష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 3.69 శాతం, స్మాల్‌క్యాప్ 4.16 శాతం చొప్పున పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే, నిర్మాణ రంగ షేర్లు అత్యధికంగా 5 శాతానికి పైగా నష్టపోయాయి. రియల్టీ, మెటల్ స్టాక్స్‌లో కూడా భారీ అమ్మకాలు కనిపించాయి. అయితే, ఐటీ రంగ షేర్లు మాత్రం తక్కువ నష్టాలతో పోల్చిచూస్తే నిలకడగా నిలిచాయి.

# బంగారం దిగింది!

**మొదటి పేజీ తరువాయి**

ఉండగా, ఇప్పుడు రూ.1,35,650కి వచ్చింది. అంటే రూ.43,200 తగ్గింది. 22 క్యారట్ బంగారం కూడా రూ.1,63,950 నుంచి రూ.1,33,800కి పడిపోయింది. అంటే రూ.30,150 తగ్గింది. బంగారం మాత్రమే కాదు, వెండి ధరలు కూడా తగ్గాయి. కిలో వెండి ధర రూ.20,000 తగ్గి రూ.2,50,000 నుంచి రూ.2,30,000కి వచ్చింది. తులం వెండి ధర రూ.2,300గా ఉంది. జనవరి 29న వెండి ధర చాలా ఎక్కువగా ఉండేది. కిలోకి రూ.4,25,000 వరకు వెళ్లింది. అక్కడి నుంచి ఇప్పుడు దాదాపు రూ.1,95,000 తగ్గింది. మల్టీ కమోడిటీ ఎక్స్‌చేంజ్‌లో కూడా బంగారం, వెండి ధరలు తగ్గాయి. గోల్డ్ ఏప్రిల్ ఫ్యూచర్స్ 6.07% (రూ.8,772) తగ్గి రూ.1,35,720 వద్ద ఉన్నాయి. సిల్వర్ మే ఫ్యూచర్స్ 7.58% (రూ.17,192) తగ్గి రూ.2,09,580 వద్ద ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ఇదే పరిస్థితి. ఒక ఔన్స్ గోల్డ్ ధర 4,300 డాలర్ల కంటే దిగువకు వచ్చి ప్రస్తుతం 4,286.97 డాలర్ల వద్ద ఉంది. ఒక ఔన్స్ వెండి ధర కూడా 65 డాలర్ల కంటే తక్కువగా, 64.23 డాలర్ల వద్ద ఉంది. ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు బంగారం, వెండి ధరలపై పెద్ద ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా మధ్యప్రాచ్య ప్రాంతంలో యుద్ధం, అమెరికా డాలర్ బలపడటం వల్ల ఈ ధరలు భారీగా తగ్గుతున్నాయని అంచనా.

# చమురు వదిలింది

**మొదటి పేజీ తరువాయి**

బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర సోమవారం ఉదయం 15 శాతం (17 డాలర్లు) తగ్గి 96 డాలర్ల కనిష్ఠానికి చేరింది. ఇక యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 13.5 శాతం (13 డాలర్లు) తగ్గి 85.28 డాలర్ల కనిష్ఠానికి చేరింది. మొత్తం మీద అంతర్జాతీయ మార్కెట్‌లలో ముడి చమురు ధరలు సగటున 13 శాతం తగ్గాయి. ఈ సానుకూల పవనాల నేపథ్యంలో అమెరికా స్టాక్ మార్కెట్‌లోని ఎస్అండ్‌పీ 500 సూచీ 1.4 శాతం పెరిగింది. ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ యుద్ధం మొదలైన తర్వాత, ఈ సూచీ ఇంతగా లాభపడటం ఇదే తొలిసారి. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ సూచీ 832 పాయింట్లు, నాస్‌డాక్ 1.7 శాతం మేర పెరిగాయి. ముడి చమురు సూచీ 8 శాతం తగ్గింది.

# దానంకు తప్పని తిప్పలు

**మొదటి పేజీ తరువాయి**

కుమార్ కీలక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ అనర్హత ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్ ఇస్తూ.. స్పీకర్ తన తుది నిర్ణయాన్ని వెలువరించారు. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్ దక్కినట్లు అయింది. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పును ఇచ్చారు. అయితే ఇప్పుడు ఈ వ్యవహారంలో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. స్పీకర్ తీర్పును కొట్టివేయాలంటూ బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు.. నోటీసులు జారీ చేసింది. నాగేందర్ పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని.. పిటిషనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచారని.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే.. ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినట్లు పిటిషన్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకే దానం నాగేందర్ వ్యవహారంలో స్పీకర్ తీర్పు సరైంది కాదని.. దాన్ని కొట్టేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీ ఫామ్‌పై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్‌ను.. ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని పిటిషనర్ తరఫు లాయర్ కోర్టుకు విన్నవించారు.

బీఆర్ఎస్ పార్టీ నుంచి కాకుండా ఇతర పార్టీ నుంచి ఎంపీగా నామినేషన్ వేసిన రోజు నుంచే దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని పిటిషనర్ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో కర్ణాటక, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఇలాంటి పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రస్తావించారు. స్పీకర్ తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి.. ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో ఇటీవలె సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్‌తో పాటు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంలో తర్వాతి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది. దీంతో ఇప్పుడు స్పీకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎలాంటి వివరణ ఇస్తారు అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# కార్ల ధరలు రయ్ రయ్

**మొదటి పేజీ తరువాయి**

నిర్ణయించింది. రోజురోజుకు పెరుగుతున్న ముడి పదార్థాల ధరలను భర్తీ చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఓ ప్రకటనలో తెలిపింది. బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా కూడా అన్ని కార్లపై 2 శాతం వరకు పెంచుతున్నామని పేర్కొంది. పెరుగుతున్న లాజిస్టిక్స్, మెటీరియల్ ఖర్చులతో పాటు, క్షీణిస్తున్న రూపాయి ప్రభావం వల్ల కూడా పెంపు నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. ఇదే బాటలో మెర్సిడెస్-బెంజ్ ఇండియా, ఆడి ఇండియా కూడా వచ్చే నెల నుంచి వాహనాల ధరల పెంపును ప్రకటించాయి.

# ట్రంప్ భయపడ్డాడు!

**మొదటి పేజీ తరువాయి**

టెహ్రాన్ స్పష్టం చేసింది ఇదంతా డొనాల్డ్ ట్రంప్ కుట్రని ఆరోపించింది. 'ట్రంప్ ప్రకటన ఆయన మునుపటి బెదిరింపుల నుంచి వెనక్కితగ్గడమే అయినా.. ఇస్లామిక్ రిపబ్లిక్ గతంలో ప్రకటించిన వైఖరికి కట్టుబడి ఉంది. హర్మూజ్ జలసంధిపై మా వైఖరి మారలేదు.. ఇరాన్‌పై దాడి చేస్తున్న దురాక్రమణదారులకు ఆ జల మార్గం మూసివేసే ఉంటుంది" అని ఇరాన్ మీడియా తెలిపింది. ఇరాన్ పార్లమెంటు జాతీయ భద్రత, విదేశాంగ విధాన కమిటీ ప్రతినిధి ఇబ్రహీం రెజాయీ మాట్లాడుతూ.. "మా పోరాటం కొనసాగుతోంది. సైతానుకు ఇది మరో ఓటమి. ట్రంప్, అమెరికా మరోసారి విఫలమయ్యాయి' అని పేర్కొన్నారు. తమతో యుద్ధంపై మరోసారి ట్రంప్ వెనక్కి తగ్గారని ఎగతాళి చేసింది. తమ నుంచి వచ్చిన గట్టి హెచ్చరిక కారణంగా ఇంధన మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకునే ప్లాన్ నుంచి అమెరికా అధ్యక్షుడు వెనకడుగు వేశారని అఫ్గన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ప్రకటించడం గమనార్హం. యుద్ధం తాత్కాలికంగా ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రకటన చేసిన కాసేపటికే.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి భీకర దాడులు చేసింది. టెహ్రాన్‌పై బాంబులతో విరుచుకుపడింది. దీంతో యుద్ధం విరమణ కేవలం అమెరికాకే పరిమితమనే సంకేతాలు ఇజ్రాయెల్ పంపినట్టయ్యింది.

# కోకాకోలా కోయ్ కోయ్

**మొదటి పేజీ తరువాయి**

బాటిల్స్, మూతలు, లేబుల్స్, కార్డ్బోర్డ్ బాక్సుల వంటి ప్యాకేజింగ్ వస్తువుల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. అయితే ధరలు పెంచాలా లేదా అనేది మార్కెట్ పరిస్థితులు.. ఇతర కంపెనీల నిర్ణయాలు, వినియోగదారుల స్పందనపై ఆధారపడి ఉంటుంది. ఇప్పటికే కొన్ని నీటి బాటిల్ కంపెనీలు ధరలను పెంచాయి. కానీ భారతదేశంలో శీతల పానీయాల మార్కెట్ చాలా పోటీగా ఉండటంతో ధరలు పెంచడం అంత సులభం కాదు. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మళ్లీ కాంపా కూలాను మార్కెట్లోకి తీసుకురావడంతో పోటీ మరింత పెరిగింది. గత 7-8 సంవత్సరాల్లో కంపెనీ పెద్దగా ధరలు పెంచలేదని రాహుల్ కుమార్ తెలిపారు. అయితే ఏప్రిల్‌లో ధరలపై సమీక్ష జరగనుంది. ఇప్పటికీ ఖర్చులు పెరుగుతున్నా, భవిష్యత్తుపై కంపెనీకి నమ్మకం ఉంది. భారత్‌లో శీతల పానీయాల మార్కెట్ రాబోయే సంవత్సరాల్లో వేగంగా పెరుగుతుందని అంచనా. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కంపెనీ కొత్తగా నాలుగు ఫ్యాక్టరీలను నిర్మించేందుకు భారీగా పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోంది.

# ఇస్తున్నారికి బ్రేక్

కానున్నందున, ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సాదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని నేను భద్రతా దళాన్ని ఆదేశించాను' అని ట్రంప్ ప్రకటించారు. ఈ వారం అంతటా తమ మధ్య లోతైన, సవివరమైన, నిర్మాణాత్మక చర్చలు కొనసాగనున్నాయని తెలిపారు. సానుకూల వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై జరపాల్సిన అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని సైన్యాన్ని ఆదేశించానని పేర్కొన్నారు. అయితే, పూర్తి నిర్ణయం మాత్రం ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలు, చర్చల ఫలితాలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి నుంచి ఇరు దేశాల మధ్య దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తుండగా.. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ యుద్ధం సోమవారం నాటికి 23వ రోజుకి చేరింది. ఇన్ని రోజులుగా కొనసాగుతున్న ఆ యుద్ధం వల్ల ఆయా దేశాల్లో కేవలం సైనికపరంగా కాకుండా ఆర్థికంగా భారీ ప్రభావం చూపిస్తోంది. ఈ యుద్ధంలో అమెరికా అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశంగా నిలుస్తోంది. యుద్ధం ప్రారంభమైన మొదటి ఆరు రోజుల్లోనే సుమారు 11.3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.93,000 కోట్లు) ఖర్చు అయింది. ఇక 12వ రోజు నాటికి 16.5 బిలియన్ డాలర్లు (రూ.1.3 లక్షల కోట్లు) దాటినట్లు అంచనా ఉంది. కొన్ని నివేదికల ప్రకారం రోజుకు బిలియన్ల డాలర్ల ఖర్చు అవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా 23 రోజులు చూసుకుంటే అమెరికాకు ఈ యుద్ధంలో దాదాపు రూ.2 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ వారానికి సుమారు 3 బిలియన్ డాలర్లు (రూ.25 వేల కోట్లు) నష్టపోతోంది. అంటే మూడు వారాల్లోనే దాదాపు రూ.75 వేల కోట్లకు

# ఉచిత బస్సు ఒక్కటే అమలు: బీజేపీ

హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ తప్ప ఏ హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. మిగతా అన్ని గ్యారెంటీలను పక్కన పెట్టి, వాటిని అమలు చేసినట్లు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై రాష్ట్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ, ఆరు గ్యారెంటీల్లో ప్రజలకు ఒక్కటి కూడా చేరడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు రైతు భరోసా కింద ఇంకా ఎకరానికి రూ.45 వేల కోట్ల బకాయిలు చెల్లించవలసి ఉందని అన్నారు. దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. దీంతో విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**అసెంబ్లీ ముట్టడికి బీజేపీ పిలుపు.. పలుచోట్ల నేతల అరెస్ట్**

అధికార కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో సోమవారం 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నిరసన కార్యక్రమం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, నేతలు పెద్ద ఎత్తున అసెంబ్లీ ముట్టడికి తరలివస్తున్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమై అసెంబ్లీ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు జిల్లాల్లో బీజేపీ నేతలను ముందస్తుగా అరెస్టు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు



గ్యారంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ తీవ్రంగా ఆరోపించింది. రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని నేతలు మండిపడ్డారు. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు నామమాత్రపు కేటాయింపులు చేసి, కీలకమైన ఈ రంగాలను ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. ముఖ్యంగా భాగ్యనగర అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధ్వజమెత్తారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు తగినన్ని నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలపై భారం మోపుతోందని కమలనాథులు విమర్శించారు. బీజేపీ పిలుపుతో హైదరాబాద్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# బేగంపేట రన్‌వే కింద మల్టీ-లేన్ అండర్‌పాస్

**ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ గ్రీన్ సిగ్నల్.. దేశంలోనే తొలి ప్రయోగం**

**కంటోన్మెంట్ సమస్యలకు పరిష్కారం: సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లో, ముఖ్యంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో ఏళ్లుగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద వాహనాల రాకపోకల కోసం మల్టీ-లేన్ అండర్‌పాస్ నిర్మాణానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి అనుమతులు సాధించినట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు. సుచిత్ర జంక్షన్ నుంచి ప్యారడైజ్ సర్కిల్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా ఈ అండర్‌పాస్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడమే కాకుండా, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ వంటి ఉత్తర జిల్లాల నుంచి నగరంలోకి వచ్చే వాహనదారులకు ప్రయాణం సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 'యాక్టివ్‌గా ఉన్న ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద అండర్‌పాస్ నిర్మించడం దేశంలోనే ఇది తొలిసారి. ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి నిర్మాణం లేదు. దీనికోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి అనుమతులు సాధించాం. పనులు కూడా ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి' అని వివరించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ఆయన అన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా హైదరాబాద్ నగరాన్ని ఢిల్లీ, ముంబైల వలె తీవ్రమైన ట్రాఫిక్, కాలుష్య సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లతో నగరంలో మౌలిక వసతులను పటిష్టం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**ఢిల్లీ పరిస్థితి రానివ్వం**

హైదరాబాద్ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, నివాసయోగ్యంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' అనే బృహత్ ప్రణాళికతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనమండలిలో సుదీర్ఘంగా ప్రసంగించిన ఆయన, నగరాభివృద్ధిపై ప్రభుత్వ దార్శనికతను, చేపట్టబోయే ప్రాజెక్టులను వివరించారు. దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు కాలుష్యం, వరదలు, ట్రాఫిక్ వంటి తీవ్ర సమస్యలతో సతమతమవుతున్నాయని, అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూస్తామని ఆయన అన్నారు. తెలంగాణను క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ), ప్యూర్ (మాన్యుఫ్యాక్చరింగ్ హబ్), రేర్ (అగ్రికల్చర్) అనే మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు సీఎం తెలిపారు. ఇందులో భాగంగా, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను బయటకు తరలించి, ఆ భూములను మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. దీనివల్ల నగరం మరింత నివాసయోగ్యంగా మారుతుందని వివరించారు. హైదరాబాద్‌ను రోడ్లు, రైల్వే, ఎయిర్‌పోర్టులతో అనుసంధానించే రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, సికింద్రాబాద్, చర్లపల్లి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసుకున్నామని గుర్తుచేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. రోడ్లను అండర్‌పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద అండర్‌పాస్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు సాధించామన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, లాస్ట్ మైల్ కనెక్టివిటీ సమస్యను అధిగమించేందుకు విస్తరించనున్నట్లు ప్రకటించారు. మెట్రో విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా ఉందని చెప్పారు. మూసీ నది ప్రక్షాళన, అభివృద్ధిపై సీఎం కీలక ప్రకటన చేశారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు మూసీ వెంట ఎలివేటెడ్ కారిడార్ నిర్మించడం ద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు రాజకీయం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించి వదిలేసిన పనులను తాము ముందుకు తీసుకెళుతుంటే అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని, నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని కోరారు. సూచనల కోసం అవసరమైతే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని వేస్తామని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు సీఎం భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనుల వల్ల ఏ ఒక్కరినీ నిరాశ్రయులను చేయబోమని, మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం తరఫున హామీ ఇచ్చారు. రాజకీయ పార్టీల ఉచ్చులో పడకుండా, అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించి, చిరు వ్యాపారులకు ప్రత్యేక స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. సుపరిపాలనతో పాటు స్మార్ట్ గవర్నెన్స్‌పై దృష్టి సారించి, హైదరాబాద్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# బియ్యం స్కాం!

**ఫిలిప్పీన్స్‌కు ఎగుమతుల్లో భారీ కుంభకోణం**

**అసెంబ్లీలో మాజీమంత్రి హరీశ్ ఆరోపణలు**

**ఆరోపణలు నిరాధారం: ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందంటూ తెలంగాణ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఎలా నియమించుకుంటారని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తక్షణమే 'హౌస్ కమిటీ' వేయాలని డిమాండ్ చేసిన హరీశ్ రావు... ప్రభుత్వం చెబుతున్న పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి లక్ష్యం కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు. ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటే తాము చేసే ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు. హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తిప్పికొట్టారు. ఇవన్నీ కేవలం నిరాధారమైన ఆరోపణలని, ప్రతిపక్ష నేతలు సిఫార్సు చేసిన వారికి పదవులు దక్కలేదనే అక్కసుతోనే సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు ప్రస్తావించిన ప్రేమ్ చంద్ గార్గ్‌కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎటువంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తెలంగాణ, ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారిక ఒప్పందమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం కారణంగానే ఎగుమతుల్లో కొంత జాప్యం జరిగిందని, అయితే అక్కడ అన్ని దిగుమతులపై ఆంక్షలు ఉన్నప్పటికీ కేవలం తెలంగాణ బియ్యానికి మాత్రమే మినహాయింపు లభించిందని వివరించారు. కేవలం ఒక షిప్‌మెంట్ మాత్రమే కాకినాడ పోర్టులో నిలిచిపోయిందని, అంతకు మించి అక్రమాలు ఏవీ జరగలేదని మంత్రి సభలో స్పష్టమైన వివరణ ఇచ్చారు.


మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# క్యూనెట్ కేసులో 32 మంది అరెస్టు

**ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే: సజ్జనార్**



హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట కోట్లాది రూపాయల మోసానికి పాల్పడింది. ఈ కేసులో సీసీఎస్ పోలీసులు 32 మంది నిందితులను అరెస్టు చేశారు. క్యూనెట్ కేసుకు సంబంధించి హైదరాబాద్ సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ, మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట క్యూనెట్ మోసం చేస్తోందని, మూడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించామని ఆయన తెలిపారు. అరెస్టైన 32 మందిలో 11 మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. అరెస్టైన నిందితుల నుంచి భారీగా ఒప్పంద పత్రాలు, లాప్‌టాప్‌లు, వస్తువులు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు ముప్పై బృందాలుగా విడిపోయి ఆపరేషన్ నిర్వహించినట్లు వెల్లడించారు. క్యూనెట్ నిర్వాహకులు 1998 నుంచి వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు. క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించినట్లు తెలిపారు. సిద్దిపేటకు చెందిన హరికృష్ణ రూ.5 లక్షల మేర మోసపోయారని, ఆయన ఫిర్యాదుతో ఈ సంస్థ కార్యకలాపాలపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కట్లు, హెల్త్ ఫుడ్స్ పేరిట ప్రజల్లోకి వెళుతూ మోసం చేస్తున్నట్లు గుర్తించామని అన్నారు. ఇష్టపూర్వకంగానే సంస్థలో చేరుతున్నట్లు ముందుగానే బాండ్‌పేపర్‌పై రాయించుకుని క్యూనెట్‌లోకి తీసుకుంటున్నారని తెలిపారు. అరెస్టైన వారిలో ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నమోదైన 4 కేసుల్లో 11 మంది బాధితులకు దాదాపు రూ.75 లక్షల నష్టం జరిగినట్లు గుర్తించామని అన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని తెలిపారు. ఇలాంటి పథకాల్లో చేరడం, చేర్పించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇంకా బాధితులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నెల రోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి, పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించి నిందితులను అరెస్టు చేసినట్లు సజ్జనార్ వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు.

# మాగంటి గోపీనాథ్ కుమార్తెలకు గాయాలు

హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జూబ్లీహిల్స్ దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుమార్తెలు అక్షర (23), దిశీర (19) తీవ్రంగా గాయపడ్డారు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్ సమీపంలో రాత్రి సుమారు 8.52 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వీరితో పాటు కారులో ప్రయాణిస్తున్న అభిరామ రెడ్డి, డ్రైవర్ అరికపూడి దుర్గా సాయి కూడా గాయాలపాలయ్యారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బాధితులు ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారు వేగంగా వెళుతున్న సమయంలో, ముందు వెళుతున్న ఒక డీసీఎం వాహనం టైరు అకస్మాత్తుగా ఊడిపోయింది. దీంతో ఆ వాహనం ఒక్కసారిగా రోడ్డుపై ఆగిపోవడంతో, వెనుక నుంచి వస్తున్న ఫార్చ్యూనర్ కారును డ్రైవర్ నియంత్రించలేకపోయాడు. అతివేగంగా ఉన్న కారు డీసీఎంను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి ఫార్చ్యూనర్ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. పెద్ద కుమార్తె అక్షర పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ఆమెకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. చిన్న కుమార్తె దిశీరకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసుపత్రికి చేరుకుని, అక్షర ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

# రాత్రి 12 అయినా సరే! ఆయన రావాల్సిందే

**ఫైనాన్స్ సెక్రటరీపై హైకోర్టు ఫైర్**

హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): తెలంగాణ ఆర్థిక శాఖ కార్యదర్శిపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలంటూ ఏడాది క్రితమే ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని అమలు చేయకపోవడాన్ని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు సోమవారం వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని గతంలోనే ఆదేశించినా, ఫైనాన్స్ సెక్రటరీ కోర్టుకు రాకపోవడంపై ధర్మాసనం నిప్పులు చెరిగింది. అసెంబ్లీ సమావేశాల కారణంగా ఆయన హాజరు కాలేకపోయారని ప్రభుత్వం తరఫు న్యాయవాది వివరణ ఇవ్వగా, హైకోర్టు దానిని ఏమాత్రం అంగీకరించలేదు. "అసెంబ్లీ సమావేశాలు ఉంటాయని కార్యదర్శికి ముందే తెలుసు కదా? మరి ముందే న్యాయస్థానం అనుమతి ఎందుకు తీసుకోలేదు?" అని ప్రశ్నించింది. ఈ సందర్భంగా హైకోర్టు చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.


ఆహ్వానం

తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ,
తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో..

స్నేహం! ప్రేమ!! సేవ!!!





వసుంధర విజ్ఞాన వికాస మండలి (విివివిఎం)
(సామాజిక, సాంస్కృతిక చైతన్య వేదిక)
స్థాపితం -1993 రి.నెం-4393/96
వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్
హైదరాబాద్

33 ANNIVERSARY
33వ వార్షికోత్సవము

కర్క ముత్తారెడ్డి స్మారక జాతీయ కవితా పురస్కారాల ప్రదానం
చంద్రమోహన్ స్మారక విద్యా పురస్కారాల ప్రదానం
కోలరాజు సుప్రీం సూపర్ డాడీ పురస్కారాల ప్రదానం
జాతీయ స్ఫూర్తి పురస్కారాల ప్రదానం

తేది: 26.03.2026 (గురువారం),
సమయం: మ.1.30 గం॥ల నుండి రా. 10.00 గం॥ల వరకు
వేదిక: రవీంద్రభారతి, సమావేశ మందిరం

ముఖ్య అతిథులు : డా.ఏనుగు నరసింహారెడ్డి ఐ.ఏ.ఎస్. గారు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు
డా. నామోజు బాలాచారి గారు, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
గౌరవ అతిథులు : శ్రీ కోరుకంటి చందర్ గారు, మాజీ ఎమ్మెల్యే, రామగుండం
శ్రీ దేవనపల్లి చక్రపాణి గారు, కార్పొరేటర్, రామగుండం
విశిష్ట అతిథులు : శ్రీ నాళేశ్వరం శంకరం గారు, అధ్యక్షులు తెరసం
శ్రీ బింగి నరేందర్ గౌడ్ గారు, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో ఆర్డినేటర్
శ్రీ గూడూరి స్వామిరెడ్డి గారు, జీకే రైతుమిత్రసమితి అధ్యక్షులు
సభాధ్యక్షులు : శ్రీ మధుకర్ వైద్యుల గారు, వ్యవస్థాపకులు
ప్రత్యేక ఆహ్వానితులు : రచ్చ రవి గారు, ప్రముఖ నటులు
జానులిరి గారు, ప్రముఖ నృత్యకారిణి
ఆత్మీయ అతిథులు: శ్రీ కోట్ల వెంకటేశ్వర రెడ్డి గారు, కాళోజీ పురస్కార గ్రహీత
శ్రీ బైస దేవదాసు గారు, నేటినిజం పత్రిక సంపాదకులు
శ్రీ బొమ్మకంటి శ్రావణ్ కుమార్ గారు, ఈ వార్తలు దినపత్రిక సంపాదకులు
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీ కర్క శ్రీధర్ రెడ్డి గారు, కర్క ముత్తారెడ్డి స్మారక ట్రస్ట్
శ్రీ కోట మాధురి గారు, కోల రాజు స్మారక ట్రస్ట్
శ్రీ బామండ్ల పల్లి రమేష్ గారు, చంద్రమోహన్ స్మారక ట్రస్ట్
సమన్వయం : బద్దిపడగ రమేష్, కట్కూరి శంకర్, దేవి లక్ష్మి నరసయ్య, కొత్త రాజేష్
వ్యాఖ్యతలు : రమాదేవి కులకర్ణి, స్రవంతి, RJ కావ్య, కావ్యశ్రీ, దుర్గాభవానీ

ఆహ్వానించువారు :
గుడికందుల భూమయ్య, ఇరుమళ్ల సుమలత, బాపురావు, లీల, అందెం శ్రీనివాస రెడ్డి, గోలి వేణుగోపాల్ రెడ్డి, లక్ష్మణ్

అందరూ ఆహ్వానితులే...

## ఐసిఏఐ, ఎస్ఆర్ఎస్బీలో
# కో–ఆప్టెడ్ మెంబర్‌గా పీవీ నారాయణరావు

హైదరాబాద్, మార్చి 23 (ఈవార్తలు): ప్రతిష్ఠాత్మకమైన ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన సస్టైనబిలిటీ రిపోర్టింగ్ స్టాండర్డ్స్ బోర్డు కో–ఆప్టెడ్ మెంబర్గా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్, సీఏ పీవీ నారాయణరావు నియమితులయ్యారు. ఈ నియామకం చార్టర్డ్ అకౌంటింగ్ రంగంలో విశిష్ట గౌరవంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఐసీఏఐ నా సేవలు గుర్తించి బాధ్యత అప్పగించినందుకు మరింత నాకు బాధ్యత పెరిగింది. సస్టైనబిలిటీ రిపోర్టింగ్ ద్వారా భారతదేశంలో పారదర్శక, బాధ్యతాయుత కార్పొరేట్ వ్యవస్థను బలోపేతం చేయడంలో నా వంతు కృషి చేస్తాన'ని పేర్కొన్నారు. ఆయన




నియామకంపై ఇరు తెలుగు రాష్ట్రాల ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

**సేవలు - నాయకత్వంలో నిబద్ధత**

2015లో ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ చైర్మన్‌గా సేవలు అందించగా, 2016లో ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీలో కో–ఆప్టెడ్ మెంబర్గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఇరు రాష్ట్రాల్లో చార్టర్డ్ అకౌంటెంట్లకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నారు.

**బోర్డు ప్రధాన లక్ష్యాలు**

కంపెనీలకు సస్టైనబిలిటీ రిపోర్టింగ్ ప్రమాణాలు రూపొందించడం, పర్యావరణ, సామాజిక బాధ్యతలపై ఆడిట్లు, సెబీ, ఎంసీఏ, నీటి ఆయోగ్ వంటి సంస్థలతో భాగస్వామ్యం, హరిత విప్లవం కోసం మార్గదర్శకత్వం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే సంస్థలకు అవార్డులు అందించడం, సీఏలకు శిక్షణ వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దీని ముఖ్య ఉద్దేశం.

# చెరువును మింగేస్తున్నారు.. కాపాడండి!

**మల్యాల భీమునికుంట చెరువులో అక్రమ నిర్మాణాలు**

**ప్రజావాణిలో జగిత్యాల కలెక్టర్‌కు ఫిర్యాదు**

మల్యాల, మార్చి 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని భీమునికుంట చెరువులో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని, వాటిని వెంటనే అడ్డుకోవాలని కోరుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ–జేఏసీ జగిత్యాల జిల్లా ఇంచార్జి దువ్వాక శివ మహారాజ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా.. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. చెరువు భూమిని కాపాడాలని, అక్రమ నిర్మాణాలు చేపట్టినవారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అనంతరం శివ మహారాజ్ మీడియాతో మాట్లాడుతూ..'ముత్యంపేటకు చెందిన మాధవరెడ్డి చెరువు భూమిని ఆక్రమించారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేస్తున్నందుకు ఇప్పటికే గ్రామపంచాయతీ ఈవో శ్రీకాంత్ రెండు నోటీసులు జారీ చేశారు. అయినా, భవన నిర్మాణం కొనసాగుతూనే ఉంది. చెరువు భూమిని ఆక్రమించినందుకు మాధవరెడ్డిపై



కేసు నమోదు చేసి, అక్రమ భవనాన్ని కూల్చివేయాలని కలెక్టర్‌ను కోరాం' అని పేర్కొన్నారు. ఆయన వెంట జేఏసీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మనాల కిషన్, గొల్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి బాలె అశోక్ ఉన్నారు.

# పీడీఎస్ బియ్యంలో అక్రమాలు

**విచారణ చేపట్టాలి: గొల్లప్రోలు బీజేపీ చీఫ్**



కాకినాడ, మార్చి 23 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలులో పీడీఎస్ బియ్యం అక్రమ దారి పడుతోందని పట్టణ బీజేపీ అధ్యక్షుడు చిట్టా మధు ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పీడీఎస్ బియ్యం అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొంతమంది రైస్ మిల్లర్లు కోటా బియ్యం కొనుగోలు చేసి, సీఎంఆర్‌కు సంచులు మార్చి పంపి రూ.కోట్లు అక్రమంగా సంపాదిస్తున్నారని అన్నారు. గొల్లప్రోలు సివిల్ సప్లై గోడౌన్‌లో బియ్యంపై విజిలెన్స్ విచారణ జరిపించాలన్నారు.



# ఏపీలో మెగా స్టీల్ ప్లాంట్‌కు భూమిపూజ

అనకాపల్లి, మార్చి 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో భారీ అధ్యాయం మొదలైంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) ఇండియా ఏర్పాటు చేయనున్న మెగా ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌కు సోమవారం శంకుస్థాపన జరిగింది. దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌గా నిలవనున్న ఈ ప్రాజెక్టు, రాష్ట్ర అభివృద్ధిలో ఒక కీలక మైలురాయి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఇది యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడమే కాకుండా, పారిశ్రామిక ఆవిష్కరణలలో ఏపీని ముందంజలో నిలుపుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఉక్కు రంగ ప్రముఖులు లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్ పాల్గొన్నారు. మొత్తం రూ.1.35 లక్షల కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో ఈ ప్రాజెక్టును దశలవారీగా చేపట్టనున్నారు. తొలిదశలో రూ.70,000 కోట్లతో 8.2 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పాదక సామర్థ్యంతో ప్లాంట్‌ను నిర్మిస్తారు. 2029 మొదటి త్రైమాసికం నాటికి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన గమ్యస్థానం అనడానికి మరో బలమైన ఉదాహరణ. మా రాష్ట్రంపై అంతర్జాతీయ వాణిజ్య వర్గాలకు ఉన్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తుంది" అని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్ మాట్లాడుతూ, "భారతదేశంతో మా భాగస్వామ్యంలో ఇది ఒక నూతన అధ్యాయం. నా 50 ఏళ్ల ఉక్కు పరిశ్రమ అనుభవంలో, ఇక్కడ నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ఒక మధురానుభూతి" అని పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వంతో ఏఎంఎన్ఎస్ రెండు కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. నూతన తరం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించడమే ఈ ఒప్పందాల ముఖ్య ఉద్దేశం.

# 10 నిమిషాల్లో భూమి రిజిస్ట్రేషన్

**హర్షం వ్యక్తం చేసిన నటుడు గోపిచంద్**



విశాఖపట్నం, మార్చి 23 (ఈవార్తలు): ప్రముఖ సినీ నటుడు గోపీచంద్ సోమవారం విశాఖపట్నంలో సందడి చేశారు. ఓ ఆస్తి రిజిస్ట్రేషన్ పని మీద గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఆయన, ప్రభుత్వ సేవల వేగంపై ప్రశంసలు కురిపించారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని రాగా, కేవలం పది నిమిషాల్లోనే తన పని పూర్తయిందని హర్షం వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా, షీలా నగర్‌లోని గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గోపీచంద్ తన వ్యక్తిగత పని మీద వచ్చారు. మింది సమీపంలో తనకు చెందిన స్థలాన్ని డెవలప్‌మెంట్ కోసం మరొకరితో చేసుకున్న ఒప్పందాన్ని రిజిస్టర్ చేయించడానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత కేవలం 10 నిమిషాల్లోనే బయోమెట్రిక్‌తో సహా అన్ని పనులు వేగంగా పూర్తయ్యాయి. ఇక్కడి సిబ్బంది పనితీరు చాలా బాగుంది" అని మెచ్చుకున్నారు. అంతకుముందు, కార్యాలయానికి వచ్చిన గోపీచంద్‌కు సబ్ రిజిస్ట్రార్ తారకేశు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. తమ అభిమాన నటుడు కార్యాలయానికి రావడంతో అక్కడ ఉన్న ప్రజలు, అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. పలువురు ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపించారు.

# జగనన్నా.. జవాబివ్వు

**అమ్మ లేఖపై స్పందించు**

**వైఎస్ షర్మిల డిమాండ్**

విజయవాడ, మార్చి 23 (ఈవార్తలు): తమ కుటుంబ ఆస్తుల వివాదంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తన తల్లి వైఎస్ విజయమ్మ విడుదల చేసిన లేఖలోని ప్రతి అక్షరం నిజమని, దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలని సవాల్ విసిరారు. సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. వివేకానంద రెడ్డిది హత్య అని తాను నిజం మాట్లాడటమే నేరమైందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. "నిజం చెప్పినందుకే నాపై ఇంతగా విరుచుకుపడుతున్నారు. వివేకా హత్య కేసులో సాక్షి మీడియా ఏడు గంటల పాటు గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేసిందో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదు. దానికి సమాధానం చెప్పాల్సింది అవినాష్ రెడ్డి, సాక్షిని నడుపుతున్న భారతీ రెడ్డి. ఆ విషయంపై మాట్లాడలేక, ఆస్తులంటూ కొత్త వివాదాన్ని సృష్టిస్తున్నారు," అని షర్మిల విమర్శించారు. తాను ఆస్తుల కోసం పాకులాడుతున్నట్టు, చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారినట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. తన పోరాటం ఆస్తుల కోసం కాదని, ఒకవేళ అదే తన అజెండా అయితే తెలంగాణలో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే పార్టీ పెట్టేదాన్నని స్పష్టం చేశారు. జగన్‌తో తాను సంతకం చేసిన ఎంఓయూ



పత్రాలను ఇన్నాళ్లూ కోర్టుకు సమర్పించలేదని, కేవలం జగన్ తన తల్లిపై కేసు వేయడం వల్లే ఆ పత్రాలు బయటకు వచ్చాయని వివరించారు. తన తల్లి విజయమ్మ విడుదల చేసిన లేఖపై వైసీపీ సైతాన్ సైన్యం చేస్తున్న దుష్ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. "విజయమ్మ అంటే రాజశేఖర్ రెడ్డి గారిలో సగం. ఆయన ఆశయాలకు సజీవ రూపం. అలాంటి వ్యక్తి, నలుగురు బిడ్డలకు ఆస్తి సమానంగా పంచాలన్నది రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశమని, జగన్ అన్యాయం చేస్తున్నాడని లేఖలో స్పష్టంగా రాశారు. ఈ గోబెల్స్ ప్రచారం ఆపాలని కూడా చెప్పారు. ఇకనైనా డీసెన్సీ ఉన్నవాళ్లు ఎవరూ ఈ విషయం మాట్లాడరు. ఇంకా మాట్లాడుతున్నారంటే, మొరగడం కుక్కల నైజం అనుకోవాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ లేఖలోని సంతకం తన తల్లిది కాదని, ఒత్తిడితో పెట్టించానని వైసీపీ ప్రచారం చేస్తోందని, నిజంగానే ఆ సంతకం ఆమెది కాకపోతే విజయమ్మే స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. జగన్ అయినా తన తల్లితో మాట్లాడించి నిజానిజాలు చెప్పించొచ్చు కదా అని నిలదీశారు. ఈ ఆస్తుల వివాదం పూర్తిగా వ్యక్తిగతమైనదని, దీనిపై మాట్లాడాల్సింది జగన్మోహన్ రెడ్డి అని షర్మిల అన్నారు. "ఇది జగన్ వ్యక్తిగత, ఆస్తులకు సంబంధించిన విషయం. దీనిపై ఆయన పార్టీ నేతల చేత, సోషల్ మీడియా సైన్యం చేత ఎందుకు మాట్లాడిస్తున్నారు? రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశం, ఇద్దరం కలిసి సంతకాలు చేసిన ఎంఓయూ గురించి తెలిసిన జగన్ మాట్లాడాలి కదా? అంటే, ఆయనకు మాట్లాడే దమ్ము లేక ఇతరుల వెనుక దాక్కుంటున్నారని అనుకోవాలా?" అని షర్మిల ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రత్యేక హోదాను, పోలవరాన్ని తాకట్టు పెట్టి మోదీకి దత్తపుత్రుడిగా మారింది జగనేనని, తాను కాదని ఆమె ఆరోపించారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసమే తాను, తన తల్లి రాజకీయాల్లో ఉన్నామని, జగన్‌లా స్వార్థ రాజకీయాలు చేయడం లేదని షర్మిల అన్నారు. ఫ్రంట్ పేజీలో రాజశేఖర్ రెడ్డి గారి ఫోటో వేసుకుని సత్యమేవ జయతే అని చెప్పుకునే సాక్షి పత్రికకు నిజం పట్ల గౌరవం లేదని విమర్శించారు. జగన్‌కు నిజం వైపు నిలబడే ధైర్యం లేకపోవడం వల్లే తన పార్టీలోని నాయకులతో తనపై విమర్శలు చేయిస్తున్నారని షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాళ్లను నాయకులు అనాలో, కుక్కలు అనాలో మీరే అనుకోండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్నది జగనే అని, ఆయన దర్శకత్వంలోనే ఈ నాటకం నడుస్తోందని ఆమె ఆరోపించారు.




# ఎల్పీజీకి బదులు పీఎన్జీ

**ఏపీ సీఎం కీలక ఆదేశాలు**

అమరావతి, మార్చి 23 (ఈవార్తలు): ఏపీలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంపై దృష్టి సారించడమే సరైన మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్యాస్ సంక్షోభాన్ని విద్యుత్ రంగానికి ఒక అవకాశంగా మలుచుకోవాలని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్ల వంటి వాటి వాడకాన్ని ప్రజల్లో ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణకు 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 60 వేల మంది మాత్రమే వినియోగించుకుంటున్నారని అధికారులు వివరించగా.. దీనిని 100 శాతం వినియోగంలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి జిల్లాలో కనీసం 10 వేల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా లక్ష్యం నిర్దేశించారు. నిలిచిపోయిన శ్రీకాకుళం – కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రికి తక్షణమే లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. వాణిజ్య రంగంలో సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'నేచురల్ గ్యాస్ పాలసీ'ని వచ్చే కేబినెట్ సమావేశం ముందుకు తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. గత ఐదు రోజులుగా గృహావసరాలకు రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపిణీ చేస్తున్నామని, మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# మా అబ్బాయి అమాయకుడు

**ఎంపీ పుట్టా మహేశ్ తండ్రి సుధాకర్**

మైదుకూరు, మార్చి 23 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో తన కుమారుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్‌కు ఎలాంటి సంబంధం లేదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్పష్టం చేశారు. తన కుమారుడు పూర్తి నిరపరాధి అని, అతడికి మాదకద్రవ్యాలు తీసుకునే అలవాటు లేదని ఆయన గట్టిగా చెప్పారు. ఈ ఆరోపణలపై కడపలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్‌లోని ఫాంహౌస్‌లో జరిగిన పార్టీకి తన కుమారుడు వెళ్లిన మాట వాస్తవమేనని, అయితే డ్రగ్స్ తీసుకోలేదని సుధాకర్ యాదవ్ తెలిపారు. "నా కుమారుడికి గుండె సంబంధిత సమస్య ఉంది. వైద్యులు స్టెంట్ కూడా వేశారు. అలాంటి వ్యక్తి డ్రగ్స్ ఎలా తీసుకుంటాడు?" అని ఆయన ప్రశ్నించారు. పోలీసులు రక్త నమూనాలు తీసుకోకుండానే పాజిటివ్ అని ఎలా చెబుతారని నిలదీశారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో రక్త పరీక్షలు చేయించగా నెగెటివ్ రిపోర్ట్ వచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ ఘటనపై టీడీపీ అధిష్ఠానానికి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించామని పుట్టా సుధాకర్ తెలిపారు. విచారణ పూర్తయితే అన్ని నిజాలు బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఓ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీపై పోలీసులు దాడి చేయగా, కొందరు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. ఈ పార్టీలో ఎంపీ మహేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో మహేశ్ యాదవ్ పేరు వినిపించడంతో టీడీపీ అధిష్ఠానం ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పుట్టా సుధాకర్ యాదవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి

# దాడి చేసినవారిపై చర్యలు తీసుకుంటారా లేదా?

**పోలీసుల తీరుపై అంబటి ధ్వజం**

**అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతానని హెచ్చరిక**

విజయవాడ, మార్చి 23 (ఈవార్తలు): తన నివాసం, కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. జనవరి 31న సుమారు 7 గంటల పాటు తన ఆస్తులపై విధ్వంసం సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన ఇంటిపై దాడి చేసిన వారికి కేవలం ఏడేళ్ల లోపు శిక్ష పడే సెక్షన్లతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని, కానీ అదే సెక్షన్లతో తనను మాత్రం 18 రోజుల పాటు జైలుకు పంపడం అన్యాయమని అంబటి మండిపడ్డారు. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ స్టేషన్ లోని సీసీటీవీ ఫుటేజీని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. టీడీపీ నేతలు దాడి చేస్తున్నప్పుడు పోలీసులు వారికి పూర్తిగా సహకరించారని, తాను ఫిర్యాదు చేసే వరకు కనీసం సుమోటోగా కూడా కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసులో దారుణంగా వ్యవహరించారని అన్నారు. ఈ దాడుల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ హస్తం ఉందని నేరుగా ఆరోపించారు. ఈ కేసులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంబటి స్పష్టం చేశారు. ఈ ఘటనపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని, అక్కడ న్యాయం జరగకపోతే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మెట్లు ఎక్కేందుకైనా సిద్ధమని హెచ్చరించారు.

# శ్రీవారికి రికార్డు స్థాయి ఆదాయం

తిరుమల, మార్చి 23 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మార్చి 22వ తేదీ ఆదివారం ఒక్కరోజే 86,091 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సోమవారం వెల్లడించింది. భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీవారి హుండీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఆదివారం ఒక్కరోజే శ్రీవారికి రూ. 4.21 కోట్ల కానుకలు హుండీ ద్వారా సమకూరాయి. అదే సమయంలో 29,664 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రస్తుతం టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు తెలిపారు. కొండపై భారీ రద్దీ నెలకొనడంతో, కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయి క్యూ లైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. శనివారంతో (మార్చి 21) పోలిస్తే ఆదివారం భక్తుల సంఖ్య, ఆదాయం రెండూ పెరిగాయి. శనివారం 77,864 మంది భక్తులు దర్శనం చేసుకోగా, రూ. 3.33 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా, తిరుమలలో మార్చి 30 నుంచి ఏప్రిల్ 1 వరకు సాలకట్ల వసంతోత్సవాలు జరగనున్నట్లు టీటీడీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# మా అభ్యర్థులను మేమే నిర్ణయిస్తాం

**బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై ఈటల ఫైర్**

మేడ్చల్, మార్చి 23 (ఈవార్తలు): బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికను రాష్ట్ర నాయకత్వం నిర్ణయించడం మానేయాలని సూచించారు. తమ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అభ్యర్థులను తామే బరిలోకి దించుతామని స్పష్టం చేశారు. 'రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి నేను ఇప్పటికే సర్వేలు చేశాం.. మా అభ్యర్థులను మేమే నిర్ణయిస్తామ'ని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇటీవల డివిజన్ అధ్యక్షుల ఎంపిక కోసం వేసిన అబ్జర్వర్ల జాబితా విషయంలో తనకు ఇప్పటికీ సమాచారం ఇవ్వలేదని తెలిపారు. పార్టీ నిర్ణయాల్లో నాకు కనీసం సమాచారం అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ నేతగా తనకు ఒక గుర్తింపు ఉందని.. బీజేపీ దాన్ని కాపాడుకోవాలని ఈటల రాజేందర్ సూచించారు. సోషల్ మీడియాలో నాపై వస్తున్న నెగెటివ్ కామెంట్స్ వెనకాల బీజేపీ పార్టీ నేతలే ఉన్నారని తెలిపారు. సొంత పార్టీ నేతలే నాపై నెగెటివ్ క్యాంపెయిన్ చేయించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ముందే ఈటల రాజేందర్ ఇలా ఆగ్రహం వ్యక్తం చేయడం హాట్ టాపిక్‌గా మారింది.



# కోర్టు ధిక్కరణ కేసులో దోషిగా రంగనాథ్

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. కోర్టు ధిక్కరణ కేసులో తెలంగాణ హైకోర్టు ఆయనను దోషిగా తేల్చింది. బతుకమ్మ కుంట భూమి వ్యవహారంలో ఉద్దేశపూర్వకంగానే రంగనాథ్ కోర్టు ఆదేశాలు ఉల్లంఘించారని సోమవారం హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ వివాదంలో ఉన్న భూమిని, ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బతుకమ్మ కుంట నిర్మించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది హైకోర్టు. వివాదంలో ఉన్న బతుకుమ్మ కుంట భూమి వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై విచారించిన హైకోర్టు సోమవారం హైడ్రా కమిషనర్‌ను దోషిగా తేల్చింది. నాలుగు వారాల్లో సదరు భూమిలో చేపట్టిన అన్ని నిర్మాణాలను తొలగించాలని, పూర్తి నివేదికను అందజేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అత్యున్నత ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. చట్టాన్ని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన ప్రభుత్వ అధికారులపై కఠిన చర్యలు తప్పవని హైకోర్టు హెచ్చరించింది.





# రైలు ప్రమాదాలకు 'కవచ్' అడ్డు

**ప్రయాగ్‌రాజ్-కాన్పూర్ మధ్య యాక్టివేట్**

**ఆటోమేటిక్ బ్రేకులు.. సిగ్నళ్ల పర్యవేక్షణ**

**తొలుత 8 జతల రైళ్లలో సేవలు ప్రారంభం**

న్యూఢిల్లీ: రైలు ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, వేగవంతంగా మార్చే దిశగా భారతీయ రైల్వే కీలక ముందడుగు వేసింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ–హౌరా కారిడార్‌లోని ప్రయాగ్‌రాజ్–కాన్పూర్ సెక్షన్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ రైలు భద్రతా వ్యవస్థను సోమవారం విజయవంతంగా ప్రారంభించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ మధ్య సుమారు 190 కిలోమీటర్ల మార్గంలో ఈ వ్యవస్థను యాక్టివేట్ చేశారు. రైలు నంబర్ 14163 ద్వారా ఈ వ్యవస్థను అమలులోకి తీసుకురాగా, జనరల్ మేనేజర్ స్వయంగా సుబేదార్‌గంజ్ నుంచి మనౌరీ స్టేషన్ వరకు ఫుట్‌ప్లేట్ తనిఖీ నిర్వహించి పనితీరును సమీక్షించారు. డివిజనల్, హెడ్ క్వార్టర్స్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'కవచ్' వ్యవస్థ, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి రూపొందించబడింది. లోకో పైలట్ పొరపాటున రెడ్ సిగ్నల్ దాటినా, ఈ వ్యవస్థ ఆటోమేటిక్‌గా బ్రేకులు వేసి రైలును నిలిపివేస్తుంది. రైలు వేగాన్ని, సిగ్నళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతను నిర్ధారిస్తుంది. ఈ వ్యవస్థతో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడం సాధ్యమవుతుంది. తొలి దశలో చౌరీ చౌరా ఎక్స్‌ప్రెస్‌తో సహా 8 జతల రైళ్లకు ఈ సేవలను అందిస్తారు. రాబోయే నెలల్లో వందే భారత్ సర్వీసులతో పాటు మరిన్ని రైళ్లకు దీన్ని విస్తరించనున్నారు. ఈ వ్యవస్థను ప్రారంభించడానికి ముందు, రైల్వే శాఖ విస్తృతమైన ట్రయల్స్ నిర్వహించింది. వ్యాప్–7 ఇంజిన్లు, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, 20 కోచ్‌ల వందే భారత్ రైలుతో ట్రయల్స్ జరిపి, విశ్వసనీయతను నిర్ధారించుకున్నారు. 20,000 కిలోమీటర్లకు పైగా ప్యాసింజర్ ట్రయల్స్ కూడా ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తిచేశారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఢిల్లీ–ముంబై, ఢిల్లీ–హౌరా కారిడార్లలోని కీలక సెక్షన్లతో కలిపి 1,450 కిలోమీటర్ల మార్గంలో 'కవచ్' వెర్షన్ 4.0ను ఏర్పాటు చేశారు. 'మిషన్ రఫ్తార్'లో భాగంగా తదుపరి దశలో ఘజియాబాద్–తుండ్లా సెక్షన్‌లో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

# థాంక్యూ ఇండియా..!

**ఇరాన్ విదేశాంగ మంత్రి ట్వీట్**

టెహ్రాన్: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, భారత్ అందించిన మానవతా సాయంపై ఇరాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన సైనిక దాడులతో నష్టపోయిన తమ దేశానికి భారత్ అండగా నిలవడం గొప్ప విషయమని పేర్కొంది. గత వారం టెహ్రాన్‌పై జరిగిన దాడుల్లో 60 మందికి పైగా పౌరులు మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ కష్ట సమయంలో భారత్ వైద్య, అత్యవసర సహాయాన్ని అందించింది. ఈ సహాయాన్ని ఇరాన్ ఎప్పటికీ మర్చిపోదని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్‌తో మాట్లాడుతూ, యుద్ధం జరుగుతున్నప్పుడు ఇలాంటి సాయం అందించడం నిజమైన స్నేహానికి నిదర్శనమని ఆయన అన్నారు. భారత్ అధికారికంగా అందించిన సాయంతో పాటు, జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం జిల్లా ప్రజలు చూపిన చొరవ ఈ ఘటనలో ప్రత్యేకంగా నిలిచిందన్నారు.

# అన్నాడీఎంకే–బీజేపీ దోస్తీ

**కొలిక్కి వచ్చిన సీట్ల పంపిణీ**




చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారం కొలిక్కి వచ్చింది. వారాలుగా సాగుతున్న ఉత్కంఠభరిత చర్చలకు తెరదించుతూ మిత్రపక్షాలకు కేటాయించిన స్థానాలను అన్నాడీఎంకే సోమవారం అధికారికంగా ప్రకటించింది. అయితే, తాము ఎన్ని స్థానాల్లో పోటీ చేయబోతున్నామనే కీలక విషయాన్ని మాత్రం అన్నాడీఎంకే వెల్లడించకుండా సస్పెన్స్ కొనసాగించడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. కేంద్ర మంత్రి, బీజేపీ తమిళనాడు ఎన్నికల ఇన్‌చార్జ్ పియూష్ గోయల్ చెన్నైకి చేరుకుని తుది దశ చర్చలను పర్యవేక్షించిన కొద్దిసేపటికే ఈ ప్రకటన వెలువడింది. కూటమి నేతలు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. దీని ప్రకారం, బీజేపీ 27 స్థానాల్లో, పట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) 18 చోట్ల, టీటీవీ దినకరన్ నేతృత్వంలోని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) 11 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. అయితే, మిగిలిన స్థానాల్లో అత్యధిక భాగం దక్కించుకోవాల్సిన అన్నాడీఎంకే తన వాటాపై స్పష్టత ఇవ్వలేదు. మిత్రులకు సర్దుబాటు చేస్తూనే, పార్టీకి పట్టున్న కీలక నియోజకవర్గాలను నిలుపుకోవడంపై అంతర్గత చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని పార్టీ వర్గాలు సూచిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కూటమిలో సీట్ల పంపకాల చర్చలు తీవ్ర ప్రతిష్టంభనను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా, చెన్నైలోని టి.నగర్ వంటి కీలక నియోజకవర్గాలతో కలిపి 50కి పైగా సీట్లు కావాలని బీజేపీ పట్టుబట్టడం చర్చలను సంక్లిష్టం చేసింది. అయితే, అన్ని సీట్లు వదులుకుంటే పార్టీ ప్రధాన ఓటు బ్యాంకు బలహీనపడుతుందని భావించిన అన్నాడీఎంకే, పరిమిత సంఖ్యకు మించి ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ఈ ప్రతిష్టంభనను తొలగించేందుకే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి గత వారం ఢిల్లీకి వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చర్చలు జరిపారు. ఇదే సమయంలో, విభేదాలను పరిష్కరించేందుకు పీఎంకే నేత అన్బుమణి రామదాస్, ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ వంటి సీనియర్ నేతలు కూడా సమాంతరంగా సంప్రదింపులు జరిపారు. ఈ చర్చల ఫలితంగానే తాజాగా ఒప్పందం కుదిరింది. మరోవైపు, అధికార డీఎంకే నేతృత్వంలోని 'సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్' కూడా తమ కూటమిలో సీట్ల సర్దుబాటును వేగవంతం చేస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి 28 స్థానాలు, సీపీఐకి 5 స్థానాలు కేటాయిస్తూ ఒప్పందాలు పూర్తి చేసింది. సీపీఎం, డీఎండీకే వంటి ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు కొనసాగుతున్నాయి. అయితే, డీఎంకే కూటమిలోనూ కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ చెన్నైలోని అనేక కీలక స్థానాలతో కలిపి మొత్తం 39 ప్రాధాన్య నియోజకవర్గాల జాబితాను డీఎంకే నాయకత్వానికి సమర్పించినట్లు సమాచారం. ఇది డీఎంకేకు కొత్త తలనొప్పిగా మారింది. ఎన్నికల వేళ తమిళనాడులోని రెండు ప్రధాన కూటములలోనూ సీట్ల సర్దుబాటు ఎంతటి సంక్లిష్టంగా మారిందో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త పన్ను చట్టం

**మారనున్న పన్నుల విధానం**




న్యూఢిల్లీ: భారత్‌లో కొత్త ఆదాయపు పన్ను చట్టం–2025ను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ కొత్త చట్టం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. అయితే, ఈ మార్పు కారణంగా ప్రస్తుత పన్ను రిటర్నుల ఫైలింగ్‌పై చెల్లింపుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఫైలింగ్ ప్రక్రియ మొత్తం ప్రస్తుతం అమల్లో ఉన్న 1961 చట్టం ప్రకారమే కొనసాగుతుందని హామీ ఇచ్చారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు (2025–26 ఆర్థిక సంవత్సరం) ఆర్జించే ఆదాయానికి పాత చట్టం ప్రకారమే పన్నులు లెక్కించి, రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. 2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి సంపాదించే ఆదాయానికి మాత్రమే కొత్త చట్టం వర్తిస్తుందని నిపుణులు వివరించారు. ప్రభుత్వం ఈ మార్పును దశలవారీగా, స్పష్టమైన ప్రణాళికతో అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ), 'ఆదాయపు పన్ను నిబంధనలు–2026'ను నోటిఫై చేసింది. దీని ప్రకారం వేతన జీవులకు పలు ఊరటనిచ్చే మార్పులు చేశారు. ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) మినహాయింపు పరిమితిని పెంచారు. 50 శాతం హెచ్‌ఆర్‌ఏ స్లాబులోకి మరిన్ని నగరాలను చేర్చారు. పిల్లల ఎడ్యుకేషన్ అలవెన్స్‌ను నెలకు రూ.3,000, హాస్టల్ అలవెన్స్‌ను నెలకు రూ.9,000 వరకు పెంచారు. అదే సమయంలో హెచ్‌ఆర్‌ఏ, ఇతర పన్ను తగ్గింపుల కోసం డాక్యుమెంటేషన్, డిక్లరేషన్ నిబంధనలను కఠినతరం చేశారు. ఈ కొత్త విధానంలో భాగంగా 'ఫైనాన్షియల్ ఇయర్', 'అసెస్‌మెంట్ ఇయర్' అనే పదాల స్థానంలో 'ట్యాక్స్ ఇయర్' అనే ఒకే పదాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఫైలింగ్‌ను సులభతరం చేసేందుకు పన్ను ఫారమ్‌లను కూడా పూర్తిగా మార్చి, కొత్త నంబర్లను కేటాయించనున్నారు. దీనివల్ల ఫైలింగ్ ప్రక్రియలో స్పష్టత పెరిగి, సందిగ్ధత తగ్గుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 8 మంది పిల్లల తండ్రి దారుణ హత్య!

చెన్నై: ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. కొన్ని రోజులుగా అదృశ్యమైన సుమేర్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ ముస్తకా గుల్షన్ అలియాస్ మున్నా (55) హత్యకు గురయ్యారు. ఈ ఘటనలో పోలీసులు ఒక మహిళ సహా ఇద్దరిని అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధం, బ్లాక్‌మెయిలే ఈ హత్యకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వివరాల్లోకి వెళితే... ఇప్పటికే ఇద్దరు భార్యలు, 18 మంది పిల్లలు ఉన్న మున్నాకు, అదే గ్రామంలో ఉంటున్న సుమన్ దేవి అనే వివాహితతో పరిచయం ఏర్పడింది. ఆమె భర్త పని కోసం ఊరు విడిచి వెళ్లడంతో ఆమెకు సహాయం చేసే నెపంతో మున్నా దగ్గరయ్యాడు. ఈ క్రమంలో ఆమెను బలవంతంగా లోబరుచుకుని సంబంధం కొనసాగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత తనను కలవాలంటూ బ్లాక్‌మెయిల్ చేసి, తీవ్రంగా వేధించడం మొదలుపెట్టాడు. ఈ వేధింపులు భరించలేకపోయిన సుమన్, తన సోదరుడికి విషయం చెప్పి మున్నాను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. పథకం ప్రకారం ఈ నెల 18న సుమన్.. మున్నాను తన పుట్టింటికి ఆహ్వానించింది. అతను రాగానే, అక్కడ మాటువేసిన ఆమె సోదరుడు, అతని స్నేహితులు ఇనుప రాడ్లతో మున్నాపై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి సమీపంలోని కాలువలో పడేశారు. మున్నా కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ముందుగా మున్నా మోటార్‌సైకిల్‌ను గుర్తించారు. అతని ఫోన్ కాల్ రికార్డుల ఆధారంగా సుమన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. ఆమె ఇచ్చిన సమాచారంతో ఆదివారం నాడు కాలువలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం సుమన్, ఆమె సోదరుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, హత్యలో పాలుపంచుకున్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు.





# క్లెయిమ్ చేయని డబ్బులు నేరుగా ఖాతాల్లోకి

**ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) ఖాతాదారులకు ఊరటనిచ్చే దిశగా కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతోంది. చాలా కాలంగా వాడకంలో లేకుండా మూతపడిన (ఇన్‌యాక్టివ్) పీఎఫ్ ఖాతాల్లోని క్లెయిమ్ చేయని నిధులను ఆటోమెటిక్‌గా సెటిల్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. దీని కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ సెటిల్‌మెంట్ వ్యవస్థను తీసుకురానుంది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, ఖాతాదారులు ఎలాంటి క్లెయిమ్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండానే వారి ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ అవుతాయి. నివేదికల ప్రకారం, తొలి దశలో భాగంగా ఆధార్ వెరిఫై అయిన సుమారు 8 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాలను ప్రాసెస్ చేయనున్నారు. ఈ ఖాతాల్లో దాదాపు రూ. 5,200 కోట్ల నిధులు ఉన్నట్లు అంచనా. వీటిలో 14,000 ఖాతాల్లో రూ. 5 లక్షలకు పైగా, 38,000 ఖాతాల్లో రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షల మధ్య బ్యాలెన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాల్లో రూ. 10,181 కోట్ల డిపాజిట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నట్లు ఈపీఎఫ్‌ఓ గుర్తించింది. వీటిలో 7 లక్షల ఖాతాలు 20 ఏళ్లకు పైబడినవి కాగా, 18 లక్షల ఖాతాలు 10 నుంచి 20 ఏళ్ల మధ్య కాలానికి చెందినవి. ఒక ఉద్యోగి 55 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేసి, వరుసగా మూడేళ్లపాటు ఎలాంటి కంట్రిబ్యూషన్ చేయకపోతే ఆ ఖాతాను ఇన్‌యాక్టివ్‌గా పరిగణిస్తారు. ఇలాంటి ఖాతాలపై వడ్డీ జమ ఆగిపోతుంది. ఇప్పటికే రూ. 1,000 లోపు బ్యాలెన్స్ ఉన్న ఇన్‌యాక్టివ్ ఖాతాలను ఆటోమేటిక్‌గా సెటిల్ చేసేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఆమోదం తెలిపింది. తాజా ప్రతిపాదన దీనికి కొనసాగింపుగా భావిస్తున్నారు. అయితే ఈ నివేదికలపై ఈపీఎఫ్‌ఓ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను పీఎఫ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటును ఈపీఎఫ్‌ఓ ఇప్పటికే ఖరారు చేసిన విషయం తెలిసిందే.

# మేం యుద్ధం చేస్తాం: ఇజ్రాయెల్

జెరూసలేం: ఇరాన్‌తో యుద్ధాన్ని ఐదు రోజుల పాటు విరమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై ఇజ్రాయెల్ స్పందించింది. యుద్ధ విరమణ అమెరికాకే పరిమితమని స్పష్టం చేసింది. తాము యుద్ధాన్ని విరమించలేదని పేర్కొంది. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రారంభమైంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల కారణంగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసింది. దీంతో దాదాపు అన్ని దేశాల్లో ఇంధన సంక్షోభం తలెత్తింది. ట్రంప్ యుద్ధాన్ని తాత్కాలికంగా విరమించినట్లు ప్రకటిస్తే, ఇజ్రాయెల్ మాత్రం అందుకు విరుద్ధంగా స్పందించడం గమనార్హం. ఇరాన్‌తో రెండురోజుల పాటు చర్చలు జరిగాయని, ఈ చర్చలు సానుకూలంగా సాగాయని, ఈ నేపథ్యంలో యుద్ధానికి ఐదు రోజుల పాటు విరామం ఇస్తున్నానని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో తదుపరి చర్చల ఫలితాల ఆధారంగా నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు.



# హర్మూజ్ నౌకలపై టోల్ చార్జీ ఉత్తదే: ఇరాన్

టెహ్రాన్: హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లే నౌకల నుంచి 2 మిలియన్ డాలర్ల చొప్పున టోల్ ఫీజు విధించనున్నట్లు వస్తున్న వార్తలపై భారతదేశంలోని ఇరాన్ ఎంబసీ స్పందించింది. ఈ ప్రచారాన్ని ఇరాన్ దౌత్య కార్యాలయం ఖండించింది. ఫీజులకు సంబంధించి తమ అధికారులు ఎవరూ ఎటువంటి ప్రకటన చేయలేదని స్పష్టం చేసింది. కొందరు వ్యక్తులు చెప్పిన వ్యక్తిగత అభిప్రాయాన్ని ఇరాన్‌కు ఆపాదించారని తెలిపింది. ఈ మేరకు భారతదేశంలోని ఇరాన్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. కొంతమంది చెప్పిన వ్యక్తిగత అభిప్రాయాలతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి నిరాధారమైన వార్తలను ఎవరూ విశ్వసించవద్దని పేర్కొంది. వ్యక్తిగత అభిప్రాయాలతో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు సంబంధం లేదని తెలిపింది. హర్మూజ్ మీదుగా వెళ్లే నౌకల నుంచి 2 మిలియన్ డాలర్ల చొప్పున టోల్ ఫీజు వసూలు చేయనున్నట్లు ఇరాన్ పార్లమెంట్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యుడు అలాయుద్దీన్ బరూజెర్దిని ప్రకటించారని స్థానిక మీడియాలో వార్తలు వచ్చాయి. యుద్ధం కారణంగా ఖర్చులు పెరగడంతో ఈ ఛార్జీలు వసూలు చేయాల్సి వస్తోందని తెలిపింది.

# సీమైన్స్ పెడతాం.. జాగ్రత్త!

**అమెరికాకు ఇరాన్ గట్టి వార్నింగ్**

టెహ్రాన్: అమెరికాకు ఇరాన్ మరోసారి గట్టి వార్నింగ్ ఇచ్చింది. అగ్రరాజ్యం భూతల దాడులకు దిగే అవకాశముందని, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనంలోకి తీసుకోచ్చనే ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారంపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ తీరం లేదా ద్వీపాలపై దాడి చేస్తే పర్షియన్ గల్ఫ్ అంతటా సీమైన్స్ పరుస్తామని ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్ హెచ్చరించింది. దీనితో గల్ఫ్ షిప్పింగ్ మార్గాలు, కమ్యూనికేషన్ లైన్లకు తీవ్ర అంతరాయం కలగవచ్చని రాయిటర్స్ కథనం పేర్కొంది. తమ తీరం నుంచే పర్షియన్ గల్ఫ్ ప్రాంత జలాల్లోకి సీమైన్స్ ప్రవేశపెట్టగలమని ఇరాన్ హెచ్చరించింది. దీనితో సుదీర్ఘకాలం గల్ఫ్ ప్రాంతమంతటా హర్మూజ్ జలసంధిలో నెలకొన్న పరిస్థితి ఉంటుందని పేర్కొంది. 1980లలో స్వల్ప సంఖ్యలో పరిచిన సీమైన్స్‌ను తొలగించడానికి 100 మైన్ స్వీపర్లు ప్రయత్నించి విఫలమైన విషయం మరిచిపోకూడదని ఇరాన్ గుర్తు చేసింది. ఇరాన్ చమురు ఎగుమతులకు ఖర్గ్ ప్రాంతం ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో ఖర్గ్‌ను ఆక్రమిస్తే ఇరాన్‌పై ఒత్తిడి తేవచ్చని అమెరికా భావిస్తోందని తెలుస్తోంది. ఇప్పటికే 4,500 మంది సెయిలర్లు, మెరైన్లను అమెరికా మోహరించింది. హెలికాప్టర్లు, ఎఫ్–35 ఫైటర్ జెట్స్, సాయుధ ల్యాండింగ్ వెహికిల్స్‌తో కూడిన బెటాలియన్‌ను కూడా పంపించింది.

# హర్మూజ్ దాటిన ఎల్‌పీజీ నౌకలు

టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రస్థాయికి చేరినప్పటికీ భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో పెద్ద ఊరట లభించింది. సుమారు 92,700 మెట్రిక్ టన్నుల వంటగ్యాస్‌తో వస్తున్న రెండు భారీ భారతీయ నౌకలు 'పైన్ గ్యాస్', 'జగ్ వసంత్' హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. ఈ నౌకలు ప్రస్తుతం గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా రేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. భారత్‌తో ఉన్న బలమైన దౌత్య సంబంధాల కారణంగా ఇరాన్ ఈ నౌకలకు ప్రత్యేక అనుమతి ఇవ్వడం విశేషం. ఇరాన్ నౌకాదళం ఈ నౌకలకు మార్గనిర్దేశం చేసి భద్రత కల్పించింది. యుద్ధ వాతావరణం నెలకొన్న గల్ఫ్ ప్రాంతంలో భారత ఇంధన భద్రతకు ఇది కీలక పరిణామంగా నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇంధన ధరల విషయానికి వస్తే, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 110 డాలర్లు దాటినా, కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం పడకుండా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచింది. అయితే, వాణిజ్య అవసరాలకు వాడే బల్క్ డీజిల్ ధరను లీటరుకు రూ.22 వరకు, ప్రీమియం పెట్రోల్ ధరను రూ.2 వరకు పెంచింది. ఈ నిర్ణయం రవాణా, తయారీ రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశంలో 15 నుంచి 20 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళనతో గ్యాస్ సిలిండర్లను ముందస్తుగా బుక్ చేసుకోవద్దని కేంద్ర పెట్రోలియం శాఖ సూచించింది. అమెరికా వంటి దేశాల నుంచి ఎల్‌పీజీ దిగుమతులను పెంచేందుకు చర్చలు జరుపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, యుద్ధం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సాధారణ ఇంధన ధరలపైనా ప్రభావం పడొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


వయ్యారి చిత్రం


దిశా పటానీ



## నా ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర: మంగ్లీ

సింగర్ మంగ్లీ గత కొద్ది రోజులుగా మైక్రో ఫైనాన్స్ వివాదంతో సతమతమవుతున్న విషయం తెలిసిందే.. కొంతమంది ఈమె పేరును వాడుకొని డబ్బులు వసూలు చేశారన్నట్టు వార్తలు జోరుగా వినిపిస్తున్న నేపథ్యంలో.. తాజాగా దీనిపై ఒక ఎమోషనల్ పోస్ట్ పంచుకుంది మంగ్లీ. ముఖ్యంగా మైక్రో ఫైనాన్స్ పేరిట జరుగుతున్న మోసాలకు.. తనకు గానీ తన కుటుంబానికి గానీ ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 'కొంతమంది మైక్రో ఫైనాన్స్ పేరిట నా పేరును ఉపయోగించి డబ్బులు వసూలు చేశారనే వస్తున్న వార్తలను ఖండిస్తున్నాను. నాకు ఆ వ్యక్తులకు , వాళ్లకు సంబంధించిన ఫైనాన్స్ వ్యాపారాలకు ఎటువంటి సంబంధం లేదు. నా ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం నన్ను, నా తమ్ముడిని రోజూ చాలామంది సంప్రదిస్తూ ఉంటారు.. ఆ ఈవెంట్ కు సంబంధించిన ఇన్విటేషన్ వివరాల వరకే గానీ.. వాళ్ళ పర్సనల్ వ్యాపారాల గురించి నాకు, నా కుటుంబానికి ఏ మాత్రం సంబంధం లేదు. ఇలాంటి మోసపూరిత విషయాలలో నా పేరును వాడుకోవడం, నన్ను ఇన్వాల్వ్ చేయడం చాలా అన్యాయం . కావాలనే కొంతమంది నా వ్యక్తిగత పేరు, ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న కరెన్సీ కి సంబంధించిన వీడియోలకు మా ఇంటికి ఎటువంటి సంబంధం లేదు. నా ప్రొఫెషన్ ఈవెంట్స్ మినహా నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు. దయచేసి నా పేరు చెప్పి ఎవరైనా డబ్బులు వసూలు చేసినా మీరు నమ్మవద్దు. అలా మోసపోయిన వారికి న్యాయం చేయాలని పోలీస్ డిపార్ట్మెంట్ ను నేను మనస్ఫూర్తిగా కోరుతున్నాను' అంటూ మంగ్లీ చెప్పుకొచ్చింది.



## రాశీ ఖన్నా తెలివైన ప్లాన్!

సినిమాల్లో అవకాశాలపై ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకున్న రాశీ ఖన్నా.. ముందుగానే తెలివైన ప్లాన్ ను రెడీ చేసుకున్నట్లు కనిపిస్తోంది. సినిమాల్లో అవకాశాలు తగ్గుతున్న వేళ, ఆమె ఓటీటీ ప్లాట్ ఫామ్స్ వైపు అడుగులు వేసింది. వెబ్ సిరీస్ లు, డిజిటల్ కంటెంట్ ద్వారా కొత్త ప్రేక్షకులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది. ఆ ప్లాన్ రాఖీ ఖన్నాకు కొంతవరకు ప్లస్ అయిందని చెప్పాలి. ఓటీటీ ప్రాజెక్టులు ఆమెకు కొత్త ఇమేజ్ ను తీసుకువచ్చాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటిగా తన టాలెంట్ చూపించడానికి ఆ ప్లాన్ సహాయపడుతుంది. కానీ శ్రీలీల మాత్రం ఇంకా అలాంటి ఆప్షనల్ ప్లాన్ వేసుకున్నట్లు కనిపించడం లేదు. ప్రస్తుతం ఆమె థియేట్రికల్ సినిమాలపైనే ఆధారపడుతున్నట్టు తెలుస్తోంది.

## ఆ హీరోలతో రష్మిక చేసేదెప్పుడు?

నేషనల్ క్రష్ రష్మిక మందన్న కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉంది. ఇప్పటికే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో పుష్ప, సూపర్ స్టార్ మహేష్ తో సరిలేరు నీకెవ్వరు వంటి సక్సెస్ ఫుల్ చిత్రాల్లో భాగమైంది. ఇంకా విజయ్ దేవరకొండ, నితిన్ వంటి యంగ్ స్టార్స్ సరసన నటించి మెప్పించింది. కానీ టాలీవుడ్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న ముగ్గురు స్టార్లు రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్ లతో మాత్రం అమ్మడు ఇంత వరకు వెండితెరను పంచుకోలేదు. ఈ క్రేజీ కాంబినేషన్లు ఎప్పుడు సెట్ అవుతుందా? అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ –రష్మిక కాంబినేషన్ కోసం మెగా ఫ్యాన్స్ కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం సుకుమార్ దర్శకత్వంలో రాబోతున్న ఆర్‌సీ17 చిత్రంలో రష్మికను హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలుస్తోంది. గతంలో పుష్ప చిత్రంతో సుకుమార్–రష్మిక కాంబో సృష్టించిన మ్యాజిక్ నేపథ్యంలో చరణ్ పక్కన శ్రీవల్లి సెట్ అయితే అది బాక్సాఫీస్ వద్ద ఒక సెన్సేషన్ అవుతుందనడంలో సందేహం లేదు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ విషయానికొస్తే వీరిద్దరి కలయికలో సినిమా రావాలని సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా డిమాండ్ ఉంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తోన్న చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్ గా నటిస్తున్నా ఒక ప్రత్యేక గీతం కోసం లేదా కీలక పాత్ర కోసం రష్మిక తీసుకుంటే బాగుంటుందనే డిమాండ్ తెరపైకి వస్తోంది. ఎన్టీఆర్ ఎనర్జీకి, రష్మిక డ్యాన్స్ గ్రేస్‌కు తగ్గట్టుగా ఒక సాంగ్ పడితే థియేటర్లు దద్దరిల్లిపోవడం ఖాయం. భవిష్యత్తులో వీరిద్దరి ఫుల్ లెంగ్త్ మూవీ కోసం నందమూరి అభిమానులు వెయిట్ చేస్తున్నారు. రెబల్ స్టార్ ప్రభాస్ పక్కన రష్మిక నటిస్తే ఆ స్క్రీన్ ప్రెజెన్స్ మరో లెవల్‌లో ఉంటుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న స్పిరిట్ మూవీలో రష్మిక పేరు మొదట వినిపించినా ప్రస్తుతం రకరకాల సమీకరణాల వల్ల అది ఇంకా అధికారికం కాలేదు. అయితే ప్రభాస్ లాంటి భారీ కటౌట్ పక్కన రష్మిక వంటి గ్లామరస్ బ్యూటీ జతకడితే అది పాన్–ఇండియా స్థాయిని దాటి గ్లోబల్ మార్కెట్‌లో కూడా ప్రకంపనలు సృష్టిస్తుంది.





## శ్రుతి.. ది ఇండిపెండెంట్

శ్రుతి హాసన్ ఎప్పుడూ తనదైన శైలిలో దూసుకుపోతోంది. తాజాగా ఆమె తన తండ్రి కమల్ హాసన్, సూపర్ స్టార్ రజనీకాంత్ల గురించి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. కెరీర్ పరంగా తాను ఎప్పుడూ వారిద్దరినీ సలహాలు అడగలేదని అసలు ఆ ప్రయత్నమే చేయలేదని అమ్మడు కుండబద్దలు కొట్టింది. బసాధారణంగా స్టార్ కిడ్స్ తమ తండ్రి మార్గదర్శకత్వంలో అడుగులు వేస్తారు. కానీ శ్రుతి మాత్రం తన తండ్రి కమల్ దగ్గరికి వెళ్లి నెక్ట్స్ ఏ సినిమా చేయాలి? నా కెరీర్ ను ఎలా ప్లాన్ చేసుకోవాలి? ఏంటి? అని ఎప్పుడూ చర్చించలేదట. రజనీకాంత్ తో కూడా ఎంతో చనువు ఉన్నా సరే ఆయన వద్దకు వెళ్లి కెరీర్ టిప్స్ అడిగే సాహసం చేయలేదంది. వృత్తిపరమైన నిర్ణయాలన్నీ తన సొంతంగానే తీసుకుంటానంది. ఒకవేళ తప్పులు జరిగినా ఆ బాధ్యత తనదేనని స్పష్టం చేసింది. సలహాలు తీసుకోకపోయినా ? వారిద్దరి నుంచి తాను కొన్ని ట్రిక్స్ మాత్రం పట్టుకుంటానని శ్రుతి వెల్లడించింది. ముఖ్యంగా వారు పని చేసే విధానం తనను ఎంతగానో ఆశ్చర్యపరుస్తుందంది. కమల్, రజనీలు ఇద్దరూ సెట్స్‌లో పని రాక్షసుల్లా శ్రమిస్తారని, ఆ క్రమశిక్షణే వారిని దిగ్గజాలుగా నిలబెట్టిందని చెప్పుకొచ్చింది. ఏమాత్రం విరామం లేకుండా, అలసట అనేది లేకుండా వారు పనిపై చూపించే శ్రద్ధే తనకు అసలైన పాఠమని పేర్కొంది.

## రోజా మాస్ స్టెప్పులు



సీనియర్ కథానాయికలు మళ్లీ రీఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. గత కొంత కాలంగా తమిళ సినిమాలకు దూరంగా ఉంటూ వస్తున్న సీనియర్ నటి శోభన ఈ ఏడాదే తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. ఇదే తరహాలో మరో ఫైర్ బ్రాండ్ రోజా కూడా తమిళ సినిమాల్లోకి పునఃప్రవేశం చేస్తోంది. ఏపీ రాజకీయాల్లో గత కొంత కాలంగా బిజీగా ఉంటూ హాట్ టాపిక్‌గా మారిన నటి, పొలిటికల్ లీడర్ రోజా మళ్లీ సినిమాల్లో బిజీ అవుతున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పాలిటిక్స్ నుంచి బ్రేక్ తీసుకున్న రోజా వరుస చిత్రాలని అంగీకరిస్తూ నటిగా బిజీ అవుతున్నారు. 12 ఏళ్ల విరామం తరువాత తమిళ ఇండస్ట్రీలోకి రీ ఎంట్రీ ఇస్తున్న రోజా అక్కడ వరుస ప్రాజెక్ట్‌లలో నటిస్తున్నారు. సంతానం హీరోగా నటిస్తున్న లెనిన్ పాండ్యన్తో రోజా తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ఈ మూవీ కంప్లీట్ కావడంతో మరిన్ని ప్రాజెక్ట్‌లని లైన్‌లో పెట్టారు. ఇందులో భాగంగా రోజా నటించిన లేటెస్ట్ మూవీ అన్బే దయానా. పారి ఎలవళగన్ కథనాయకుడిగా నటించి తెరకెక్కిస్తున్నాడు. జాబిలమ్మ నీకు అంత కోపమా ఫేమ్ రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా నటిస్తోంది.

## మళ్లీ పెళ్లి కచ్చితంగా..కానీ: నిహారిక



మెగా డాటర్ నటి నిహారిక కొణిదెల వైవాహిక జీవితం గురించి స్పందించింది. 'భవిష్యత్తులో మళ్లీ పెళ్లి ఖచ్చితంగా చేసుకుంటాను. కానీ అప్పుడే కాదు అని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి తన ప్రాధాన్యత కేవలం సినిమా నిర్మాణం ,నటనపైనే ఉందని నిహారిక తెలిపారు. ప్రతి ఒక్కరూ పెళ్లి అనేది జీవితాంతం ఉండాలని కోరుకుంటారు. కానీ కొన్నిసార్లు పరిస్థితులు మనం ఊహించినట్లు ఉండవు' అని తన గత అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. ఒక రిలేషన్‌షిప్ వర్కౌట్ కాకపోవడానికి అనేక కారణాలు ఉంటాయని, ప్రస్తుతానికి తాను ఆ చాప్టర్ నుంచి బయటపడి కెరీర్ గ్రాఫ్‌ను పెంచుకునే పనిలో ఉన్నానని పేర్కొన్నారు. 'పిల్లలను కనాలనే కోరిక తనకు ఉందని, దాని కోసం పెళ్లి అనేది తప్పనిసరి అని సరదాగా వ్యాఖ్యానించారు. అయితే ఆ సమయం ఎప్పుడు వస్తుందనేది ఇప్పుడే చెప్పలేనని కాలమే అన్ని నిర్ణయిస్తుంది' అని ఆసక్తికర సమాధానమిచ్చారు.

# క్యాండిడేట్స్ టోర్నీని బాయ్‌కాట్ చేస్తున్నా



భారత ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి కఠినమైన నిర్ణయం తీసుకుంది. ప్రతిష్ఠాత్మకమైన ఫిడే మహిళల క్యాండిటేట్స్ టోర్నమెంట్ నుంచి ఆమె వైదొలిగింది. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నందున భద్రతపై ఆందోళనగా ఉందని చెప్పిన ఆమె.. బాంబుల మోతల మధ్య చెస్‌పై శ్రద్ధ పెట్టడం సాధ్యమవ్వదని వాపోయింది. ఇదివరకే టోర్నీ వేదికపై అసంతృప్తి వ్యక్తం చేసిన హంపి చివరకు టోర్నీని బాయ్‌కాట్ చేయాలని భావించింది. ఈ విషయాన్ని సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించిందీ గ్రాండ్‌మాస్టర్. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారత క్రీడాకారిణులు ప్రధాన టోర్నీలకు దూరమవుతున్నారు. దుబాయ్‌లో చిక్కుకొని ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు పీవీ సింధు దూరమవ్వగా.. కోనేరు హంపి సైతం మెగా ఈవెంట్ నుంచి వైదొలిగింది. మధ్య ఆసియాలోని సిప్రస్‌లో మార్చి 28 నుంచి మొదలయ్యే ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో తాను ఆడడం లేదని సోమవారం హంపి ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది. 'చాలా సమయం ఆలోచించి నేను కీలక నిర్ణయం తీసుకున్నాను. ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి వైదొలుగుతున్నా. వ్యక్తిగత భద్రత, సురక్షితంగా ఉండడం కంటే ఏ ఈవెంట్ ముఖ్యమైనది కాదు. నిర్వాహకులు భరోసా కల్పించినప్పటికీ ప్రస్తుతం అక్కడి పరిస్థితుల్లో నేను సురక్షితంగా ఉంటానని నాకు అనిపించడం లేదు. ఈ నిర్ణయం బాధతో కూడినదే. కానీ, తప్పనిసరిగా తీసుకోవాల్సి వచ్చింది. నేను నా నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను' అని హంపి తన పోస్ట్‌లో వెల్లడించింది. హంపి వైదొలగడంతో ఆమె స్థానంలో ఉక్రెయిన్ అమ్మాయి అన్నా ముజిచుక్ క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికైంది. అయితే.. టోర్నీలో ఆడనందుకు హంపిపై భారీ జరిమానా పడింది.



# పాక్ వస్తే చస్తారు!

**వార్నర్, స్మిత్‌కు ఉగ్రసంస్థ బెదిరింపులు**

పాకిస్థాన్ సూపర్ లీగ్ టీ20 టోర్నమెంట్ నిర్వహణ ఆగమ్యగోచంగా ఉంది. ఆ టోర్నీ జరుగుతుందో లేదో ఇంకా తెలియడం లేదు. అయితే ఆ టోర్నీలో పాల్గొనేందుకు వస్తున్న విదేశీ క్రికెటర్లకు బెదిరింపులు వస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన ఓ సాయుధ గ్రూపు తాజాగా వార్నింగ్‌లు జారీ చేసింది. విదేశీ ఆటగాళ్లను పంపవద్దు అని బోర్డులకు హెచ్చరిక చేసింది. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ఆడేందుకు ఆసక్తిగా ఉన్న ఆసీస్ క్రికెటర్లు డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్‌కు సాయుధ గ్రూపు వార్నింగ్ వచ్చినట్లు తెలుస్తోంది. మార్చి 26వ తేదీ నుంచి పీఎస్ఎల్‌ను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. పాకిస్థాన్‌కు క్రికెటర్లను పంపవద్దు అంటూ సంబంధిత బోర్డులకు సలహా ఇస్తున్నామని, ఒకవేళ వాళ్లకు ఏదైనా జరిగినా, అది తమ బాధ్యత కాదు అని, మేం ముందే వార్నింగ్ ఇస్తున్నామని తెహ్రిక్ ఈ తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) సీనియర్ కమాండర్ అసద్ మన్సూర్ తెలిపారు. సోషల్ మీడియా టీటీపీ కమాండర్ జారీ చేసిన వార్నింగ్ వైరల్ అవుతోంది. పీఎస్ఎల్‌లో విదేశీ ప్లేయర్లు పాల్గొనవద్దు అని హెచ్చరిక చేశారు.

# ఆ రోజు రాత్రి ఎంతో ప్రత్యేకం



ఐపీఎల్ ప్రతి సీజన్‌లో 'ఈసాలా కప్ నమదే' అనేది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లక్ష్యంగా ఉండేది. ఆరంభ సీజన్ నుంచి 17వ ఎడిషన్ వరకూ మూడు సార్లు ఫైనల్ చేరినా ఆర్సీబీని ఓటమే పలకరించింది. కానీ, పద్దెనిమిదో సీజన్‌లో బెంగళూరు కల సాకారమైంది. ఎట్టకేలకు సుదీర్ఘ నిరీక్షణలకు తెరదించుతూ నిరుడు జూన్ 3వ తేదీన ఐపీఎల్ ట్రోఫీని ఒడిసిపట్టింది బెంగళూరు. ఏళ్ల ఎదురుచూపు ఫలించిన వేళ.. భావోద్వేగానికి లోనైన విరాట్ కోహ్లీ పంతొమ్మిదో సీజన్ సమీపిస్తున్న వేళ తమ జట్టు గెలుపు సంబురాలను ఓసారి గుర్తు చేసుకున్నాడు. 'ఆర్సీబీ ఆటగాళ్లకు, ఫ్రాంచైజీకి, అభిమానులకు జూన్ 3 రాత్రి ఎంతో ప్రత్యేకం. ఐపీఎల్ మొదటి రోజు నుంచి నేను, రమేశ్ మనే(టీమ్ కేర్ టేకర్) బెంగళూరుతో ఉన్నాం. ఆర్సీబీ గ్రూప్‌లో మేమే అందరికంటే పాత సభ్యులం. పద్దెనిమిదో సీజన్‌లో ఫైనల్ చేరాక నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. కానీ, విజయం అంత తేలిక కాదని తెలుసు. ఎందుకుంటే.. లీగ్ ఆసాంతం గొప్పగా ఆడిన పంజాబ్ కింగ్స్‌తో ఫైనల్. బలమైన జట్లను ఓడించి ఫైనల్‌కు దూసుకొచ్చిన ఆ టీమ్ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉంది. గతంలో మూడుసార్లు మేము ట్రోఫీకి దగ్గరగా వచ్చాం. కానీ, విజేతలం కాలేదు. చెప్పాలంటే ఆ ఓటములే మాలో ఈసారి గెలిచి తీరాల్సిందేనన్న కసిని రగిల్చాయి. లీగ్ దశ నుంచి మంచి క్రికెట్ ఆడి మేము ఫైనల్ చేరాం. పటిష్టమైన జట్లను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించాం. అందుకే.. ఆరోజు రాత్రి చాలా అద్భుతమైనది. ఫైనల్లో గెలిచిన క్షణం నేను చాలా సంతోషించాను. ఆర్సీబీతో నా పద్దెనిమిదేళ్ల ప్రయాణం ఒక్కసారిగా కళ్లముందు మెదిలింది. మంచి సందర్భాలతో పాటు చెడు సంఘటనలు గుర్తుకొచ్చాయి. అప్పుడు భావోద్వేగాలను మాటల్లో చెప్పడం కష్టమనిపించింది. విజేత ఎవరో తేల్చే చివరి ఓవర్ అందరిలో ఉత్కంఠ రేపింది. అయితే.. ఎన్నడూ నో బాల్ వేయని జోష్ హేజిల్‌వుడ్ ఈసారి కూడా నో బాల్ వేయడని నా గట్టి నమ్మకం. అతడిపై నమ్మకం ఉన్నా.. అనుకున్న ఫలితం రావాలిగా. అప్పటికే మ్యాచ్ మావైపు మొగ్గింది.

# ఒరేయ్ నితీశ్.. నువ్వు టెస్ట్ ప్లేయర్‌రా





సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ ఆల్‌రౌండర్ తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి, కెప్టెన్ ఇషాన్ కిషన్ మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. నితీశ్ కుమార్ రెడ్డి టీమిండియా టెస్ట్ టీమ్‌లో ఉన్నాడని గుర్తు చేస్తూ ఇషాన్ కిషన్ నవ్వులు పూయించాడు. ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫ్యాన్స్ మీట్‌లో కెప్టెన్ ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, ట్రావిస్ హెడ్, హెన్రీచ్ క్లాసెన్, జయదేవ్ ఉనాద్కత్, అభిషేక్ శర్మ సందడి చేశారు. ఈ సందర్భంగా హోస్ట్ అడిగిన ప్రశ్నలకు నితీశ్ కుమార్ రెడ్డి చురుకైన సమాధానాలు ఇచ్చాడు. ఈ సందర్భంగా ఇషాన్ కిషన్ జోక్యం చేసుకొని తన సరదా వ్యాఖ్యలతో నవ్వులు పూయించాడు. పవర్ ప్లే ఆడటం ఇష్టమని నితీశ్ కుమార్ రెడ్డి తెలుపగా.. ఆరో స్థానంలో ఆడుతావని ఇషాన్ గుర్తు చేశాడు. జట్టు కోసం ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేసేందుకు తాను సిద్ధమని నితీశ్ రెడ్డి స్పష్టం చేశాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.



# ప్రాక్టీస్ మ్యాచ్‌లో దుమ్మురేపిన కోహ్లీ

ఐపీఎల్ 2026 సీజన్ కోసం డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) సిద్ధమవుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సన్నదమవుతోంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ప్రాక్టీస్ క్యాంప్‌లో ముమ్మరంగా సాధన చేస్తోంది. మరో 5 రోజుల్లో ఈ క్యాష్ రిచ్ లీగ్ తెరలేవనుండటంతో అస్త్రశస్త్రాలను సిద్దం చేసుకోంటుంది. ఈ సన్నాహకాల్లో భాగంగా ఆదివారం ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. జట్టులోని ఆటగాళ్లంతా రెండు జట్లుగా విడిపోయారు. ఒక జట్టుకు కృనాల్ పాండ్యా సారథ్యం వహించగా.. మరో జట్టును వెకంటేష్ అయ్యర్ నడిపించాడు. ఈ సన్నాహక మ్యాచ్‌లో జితేశ్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ చెలరేగాడు. 37 బంతుల్లోనే 81 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గత సీజన్ తరహాలోనే ఈ సీజన్‌లోనూ ఆర్‌సీబీ ఫినిషర్‌గా సత్తా చాటేందుకు రెడీ అయ్యాడు. అతని తర్వాత ఆస్ట్రేలియా ఆటగాడు టీమ్ డేవిడ్ 14 బంతుల్లో 36 పరుగులు చేశాడు. రూ.7 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేష్ అయ్యర్ 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 12 బంతుల్లో 3 సిక్సలతో 29 పరుగులు చేశాడు. తక్కువ పరుగులే చేసినా.. దూకుడుగా ఆడాడు. వెంకటేశ్ అయ్యర్‌ను మిడిలార్డర్‌లో ఆడించాలనే యోచనలో ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌కు సంబంధించిన ఒక వీడియోను ఆర్‌సీబీ ఫ్రాంచైజీ సోమవారం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ వీడియోలో కృనాల్ పాండ్యా మాట్లాడుతూ.. 'ఇది ఒక గొప్ప ప్రాక్టీస్ మ్యాచ్. భువనేశ్వర్ కుమార్, అభినందన్ సింగ్, మంగేష్ యాదవ్ బౌలింగ్‌లో బాగా రాణించాడు. జితేష్ శర్మ, టీమ్ డేవిడ్, వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు'అని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్‌సీబీ తమ తొలి టైటిల్‌ను అందుకున్న విషయం తెలిసిందే. ఈ జోరును తాజా సీజన్‌లోనూ కొనసాగించి టైటిల్ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే ఆర్‌సీబీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఫస్టాఫ్ షెడ్యూల్‌లో ఆర్‌సీబీ.. చిన్నస్వామి స్టేడియంలో రెండు మ్యాచ్‌లు ఆడనుంది. గౌహతిలో రాజస్థాన్ రాయల్స్, ముంబైలో ముంబై



# కృనాల్ పాండ్యా.. ఐపీఎల్ చరిత్రలో ఒకేఒక్కడు

రెండుసార్లు ఐపీఎల్ ఫైనల్లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నది మాత్రం ఒకేఒక్కడు. ఐపీఎల్‌లో రికార్డు బ్రేకర్స్ ఎందరున్నా కృనాల్ పాండ్యా చెక్కుచెదరని రికార్డు నెలకొల్పాడు. రెండుసార్లు ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడీ ఆల్‌రౌండర్. 2017లో ముంబై ఇండియన్స్‌కు ఆడిన కృనాల్ ఫైనల్లో 38 బంతుల్లో 47 పరుగులతో రాణించాడు. పద్దెనిమిదో సీజన్‌లో (2025లో) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జెర్సీ వేసుకున్న ఈ లెఫ్ట్ హ్యాండర్ ఫైనల్లో రెచ్చిపోయాడు. నిరుడు జూన్ 3 వ తేదీన జరిగిన టైటిల్ పోరులో పంజాబ్ కింగ్స్ బ్యాటర్లను దెబ్బతీసి మ్యాచ్‌ను ఆర్సీబీవైపు తిప్పాడు. 17 పరుగులే ఇచ్చి 2 కీలక వికెట్లు తీసిన కృనాల్ పాండ్యా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు. తద్వారా రెండుసార్లు ఐపీఎల్ ఫైనల్లో ఈ అవార్డు అందుకున్న తొలి ఆటగాడిగా ఈ బరోడా క్రికెటర్ రికార్డు నెలకొల్పాడు.

# ఐపీఎల్‌కు వెళ్తే కఠిన చర్యలు: పీసీబీ




చివరి నిమిషంలో పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) నుంచి తప్పుకునే విదేశీ ఆటగాళ్లను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీ హెచ్చరించాడు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం పీఎస్ఎల్ నుంచి తప్పుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాడు. వరుసగా రెండో ఏడాది కూడా పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్), ఐపీఎల్‌లు ఒకే సమయంలో జరగనున్నాయి. దాంతో చాలా మంది విదేశీ ఆటగాళ్లు పీఎస్ఎల్‌ను వదిలేసి ఐపీఎల్ ఆడేందుకు మొగ్గు చూపుతున్నారు. జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరాబాని, శ్రీలంక స్టార్ ఆల్‌రౌండర్ దసన్ షనక, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరణ్ పీఎస్ఎల్‌ను వీడి ఐపీఎల్ ఆడేందుకు సిద్ధమయ్యారు. చివరి నిమిషంలో ఈ ఆటగాళ్లు పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీలతో తమ ఒప్పందాలను రద్దు చేసుకున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన మోహ్‌సిన్ నఖ్వీ విదేశీ ఆటగాళ్లపై విమర్శలు గుప్పించాడు. 'మేం రూల్స్ ప్రకారం ఆటగాళ్లపై చర్యలు తీసుకుంటాం. గతేడాది పెషావర్ జల్మీకి ఆడిన కార్బిన్ బోష్.. ఆఖరి నిమిషంలో జట్టును వీడి ముంబై ఇండియన్స్‌లో చేరాడు. దాంతో పీఎస్ఎల్ ఆడకుండా అతనిపై ఏడాది పాటు నిషేధం విధించారు.

# విదేశీ ప్లేయర్లపై గవాస్కర్ ఫైర్!

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్న వేళ.. భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ విదేశీ ప్లేయర్ల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కొందరు విదేశీ స్టార్లు ఐపీఎల్ ఫ్రాంచైజీలను, భారతీయ ఆతిథ్యాన్ని తక్కువ అంచనా వేస్తున్నారని గవాస్కర్ మండిపడ్డారు. ప్రతి ఏటా ఐపీఎల్ వేలానికి ముందు అందుబాటులో ఉంటామని చెప్పి.. తీరా టోర్నీ మొదలయ్యే సమయానికి గాయాలు లేదా వ్యక్తిగత కారణాలు చెబుతూ విదేశీ ప్లేయర్లు తప్పుకోవడం లేదా ఆలస్యంగా రావడం పరిపాటిగా మారిందని.. గవాస్కర్ తన తాజా కాలమ్‌లో ఘాటుగా స్పందించారు. ఐపీఎల్ ఫ్రాంచైజీ యాజమాన్యాలు ప్లేయర్ల కోసం ఎంతో ఖర్చు చేస్తాయని.. వారి కుటుంబ సభ్యులు వచ్చి వారితో గడపడానికి అయ్యే ఖర్చులను కూడా భరిస్తాయని గవాస్కర్ చెప్పుకొచ్చారు.

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# పేదలపై పెనాల్టీ

**బ్యాంకింగ్** రంగం ఆధునీకరణ వైపు అడుగులు వేస్తున్న తరుణంలో, సామాన్య ఖాతాదారుల పొదుపుపై 'కనీస నిల్వ' భారం శాపంగా మారింది. నిరుపేదలు, కూలీలు, పింఛనుదారులు తమ అత్యవసరాల కోసం దాచుకున్న స్వల్ప మొత్తాలను కూడా బ్యాంకులు జరిమానాల పేరుతో హారతి పట్టడం విచారకరం. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించిన సమాచారం ప్రకారం, కేవలం మూడు ఏళ్లలో ఖాతాదారులు దాదాపు రూ.19,000 కోట్లు పెనాల్టీల రూపంలో నష్టపోయారు. ఇందులో ప్రైవేటు బ్యాంకుల వాటా అధికంగా ఉంది. ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకే రూ.3,800 కోట్లు, యాక్సిస్ బ్యాంక్ రూ.2,700 కోట్లు వసూలు చేయడం చూస్తుంటే ఈ నిబంధన ఎంత కఠినంగా ఉందో అర్థమవుతోంది. ఓ కూలీ మహిళ తన ఉపాధి హామీ వేతనం రూ.500 ఖాతాలో వేసుకుంటే, అందులో రూ.440 జరిమానా కింద కట్ అయిన ఉదాహరణలు బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతున్నాయి. పెన్షనర్లు తమ మందుల కోసం విత్ డ్రా చేసినా, బ్యాలెన్స్ తగ్గిందన్న కారణంతో పెనాల్టీలు వేయడం నైతికంగా సరికాదు. ఖాతాలో బ్యాలెన్స్ సున్నాకి చేరిన తర్వాత నెగటివ్ బ్యాలెన్స్ అయ్యేలా బ్యాంకులు చార్జీలు వసూలు చేయకూడదని ఆర్బీఐ స్పష్టం చేసింది. కానీ, చాలా బ్యాంకులు ఖాతాలో డబ్బులు పడగానే పాత బకాయిల పేరిట వాటిని కట్ చేసుకుంటున్నాయి. చార్జీలు వసూలు చేసే ముందు కస్టమర్‌కు ఎస్ఎంఎస్ లేదా ఈమెయిల్ ద్వారా సమాచారం ఇవ్వాలి. నిల్వను సరిచేసుకోవడానికి కనీసం ఒక నెల సమయం ఇవ్వాలి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2020 నుంచే కనీస నిల్వ చార్జీలను ఎత్తివేసి సామాన్యులకు ఊరటనిచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి కొన్ని ప్రభుత్వ బ్యాంకులు కూడా ఈ దిశగా అడుగులు వేశాయి. అయితే, ప్రైవేటు బ్యాంకులు మాత్రం ఇప్పటికీ లాభార్జనే ధ్యేయంగా భారీ చార్జీలను కొనసాగిస్తున్నాయి. ఇటీవల పార్లమెంటరీ ప్యానెల్ కూడా కనీస నిల్వపై జరిమానాలను పూర్తిగా నిలిపివేయాలని సిఫార్సు చేసింది. పెనాల్టీలకు బదులు, ఎక్కువ బ్యాలెన్స్ ఉంచే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా ఖాతాదారులను ఆకర్షించాలని సూచించింది. ఆర్థిక సమ్మిళితం అంటే ప్రతి ఒక్కరినీ బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం మాత్రమే కాదు, వారి పొదుపుకు భద్రత కల్పించడం కూడా. బ్యాంకులు తమ నిర్వహణ ఖర్చుల సాకుతో పేదల పొట్ట కొట్టకూడదు. ప్రభుత్వం, ఆర్బీఐ జోక్యం చేసుకుని అన్ని బ్యాంకుల్లోనూ కనీస నిల్వ జరిమానాలను పూర్తిగా రద్దు చేయడమే కాకుండా, సేవా చార్జీల విషయంలో పారదర్శకతను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వీర తెలంగాణ.. పోరాట నినాదం



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

తెలంగాణ ప్రజల సంఘటిత సాయుధ పోరాటమే "వీర తెలంగాణ" అనే పేరుకు చారిత్రాత్మకమైన అర్థాన్ని ఇచ్చింది. ఈ పేరు యాదృచ్ఛికంగా పుట్టలేదు; అది భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సామాన్య ప్రజలు సాగించిన అసాధారణ పోరాటానికి లభించిన గౌరవసూచకం. ముఖ్యంగా 1946 నుండి 1951 వరకు కొనసాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భారత ఉపఖండ చరిత్రలోనే అతిపెద్ద ప్రజా తిరుగుబాట్లలో ఒకటిగా నిలిచింది. ఇది కేవలం నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటన మాత్రమే కాదు; సామంత శోషణ, వెట్టిచాకిరి, దోపిడీ భూవ్యవస్థ, అధికార దౌర్జన్యం, గ్రామీణ దమనకాండకు వ్యతిరేకంగా సాగిన విస్తృత సామాజిక ఉద్యమం. అందుకే తెలంగాణ చరిత్రలో ఈ పోరాటం ఒక రాజకీయ ఘటనగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక విప్లవ ప్రక్రియగా గుర్తింపుపొందింది. తెలంగాణ ప్రాంతం నిజాం హయాంలో హైదరాబాదు రాష్ట్రంలో భాగంగా ఉండేది. ఆ కాలంలో గ్రామీణ సమాజ నిర్మాణం తీవ్ర అసమానతలతో నిండిపోయి ఉండేది. పైభాగంలో దొరలు, దేశ్ముఖులు, జాగీర్దార్లు, పెద్ద భూస్వాములు ఉండగా, కిందస్థాయిలో భూమిలేని కౌలురైతులు, కూలీలు, దళితులు, గిరిజనులు, సేవక వర్గాలు ఉండేవి. రైతు సాగు చేసినా భూమిపై హక్కు ఉండేది కాదు. అనేక చోట్ల పంటలో సింహభాగం భూస్వామి చేతికి వెళ్లేది. "వెట్టి" అనే బలవంతపు ఉచిత శ్రమ ప్రజల మెడపై పెద్ద భారంగా ఉండేది. గ్రామ ప్రజల శ్రమ, సంపద, గౌరవం అన్నీ కొద్దిమంది దోపిడీ వర్గాల ఆధీనంలో ఉండేవి. భూమి సాగు చేసేవారికి కాకుండా, భూమిని నియంత్రించే శక్తులకే అధికారం ఉండటం తెలంగాణలో తీవ్రమైన అసంతృప్తికి దారితీసింది. ఈ పరిస్థితుల్లో 1920ల నుండి 1930ల మధ్య సామాజిక చైతన్య విత్తనాలు నాటబడ్డాయి. 1921లో ఆంధ్ర జనసంఘం ప్రారంభమైన తర్వాత, తెలంగాణలో భాష, విద్య, సామాజిక హక్కులపై చర్చలు మొదలయ్యాయి. తర్వాత ఇది ఆంధ్ర మహాసభగా అభివృద్ధి చెందింది. మొదట ఇది సాంస్కృతిక, విద్యా, సామాజిక అంశాలపై దృష్టి పెట్టినా, క్రమంగా గ్రామీణ సమస్యలు, రైతాంగ బాధలు, నిజాం పాలనలోని అసమానతలపై స్పందించడం ప్రారంభించింది. 1930ల చివరినాటికి ఆంధ్ర మహాసభలో ప్రగతిశీల, వామపక్ష భావజాల ప్రభావం పెరిగింది. 1939 తర్వాత కమ్యూనిస్టు కార్యకర్తలు గ్రామాల్లోకి ప్రవేశించి రైతు, కూలీల సమస్యలను సంఘటితం చేయడం ప్రారంభించారు. అదే తెలంగాణ సాయుధ పోరాటానికి సిద్ధాంతాత్మక, సంస్థాగత పునాది వేసిన దశ.

1940లలో రెండో ప్రపంచ యుద్ధ ప్రభావం, ఆర్థిక కష్టాలు, ధాన్య కొరత, ధరల పెరుగుదల, అధికారుల అణచివేత ప్రజల అసహనాన్ని మరింత పెంచాయి. 1944 నుండి 1945 మధ్య ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు గ్రామీణ తెలంగాణలో విస్తరించాయి. నల్లగొండ, వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లో రైతు సంఘాలు ఏర్పడటం ప్రారంభమైంది. భూమి, కౌలు, వెట్టి, అడ్డపు పన్నులు, దోపిడీపై ప్రజా నిరసనలు పెరిగాయి. ఈ దశలో పోరాటం ఇంకా పూర్తిస్థాయి సాయుధ రూపం దాల్చకపోయినా, గ్రామాల్లో ప్రజా సంఘటనం వేగంగా పెరిగింది. తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యక్ష ఆరంభ దశగా సాధారణంగా 1946 సంవత్సరం పేర్కొనబడుతుంది. ముఖ్యంగా నల్గొండ జిల్లా కడివెండి ప్రాంతంలో దొడ్డి కొమరయ్య హత్య ఒక కీలక మలుపుగా నిలిచింది. 1946లో జరిగిన ఈ ఘటన ప్రజా ఆగ్రహాన్ని రగిలించింది. దొరల అణచివేతకు వ్యతిరేకంగా నిలిచిన కార్యకర్త దొడ్డి కొమరయ్య మరణం ప్రజా ఉద్యమాన్ని మరింత యుద్ధోన్ముఖంగా మలిచింది. అతని త్యాగం తర్వాత గ్రామీణ ప్రజలు కేవలం వినతులు, నిరసనలు సరిపోవని గ్రహించి స్వీయరక్షణ కోసం ఆయుధాలు ఎత్తుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భం నుంచే తెలంగాణ రైతాంగ ఉద్యమం సాయుధ పోరాట దిశగా అడుగులు వేసింది. 1946 నుండి 1947 మధ్య తెలంగాణలోని అనేక గ్రామాల్లో రైతు సంఘాలు బలపడాయి. భూస్వాముల అన్యాయ వసూళ్లు, బలవంతపు ధాన్యసేకరణ, మహిళలపై దాడులు, గ్రామీణ పేదలపై నిర్బంధాలకు ప్రతిగా ప్రజలు సంఘటితం కావడం ప్రారంభించారు. కొన్నిచోట్ల దొరల భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచే చర్యలు ప్రారంభమయ్యాయి. వెట్టిచాకిరిని తిరస్కరించడం ఒక పెద్ద సామాజిక ప్రకటనగా మారింది. గ్రామాల్లో "సంఘం" అనే పదం ప్రజా ప్రతిఘటనకు గుర్తుగా మారింది. ఈ సంఘాలు కేవలం రాజకీయ వేదికలు కాదు; గ్రామ సమాజాన్ని పునర్వ్యవస్థీకరించే సంస్థలుగా పనిచేశాయి.

1947 సంవత్సరం భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్య సంవత్సరం అయినా, తెలంగాణకు అది విముక్తి సంవత్సరం కాలేదు. 1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్ పాలన నుండి స్వతంత్రం పొందిన తర్వాత కూడా హైదరాబాదు సంస్థానం నిజాం ఆధీనంలోనే కొనసాగింది. నిజాం భారతసంఘంలో విలీనానికి నిరాకరించాడు. దీంతో తెలంగాణ ప్రజలకు ద్వంద్వ దమన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు స్థానిక సామంతశక్తులు, మరోవైపు నిజాం సంస్థాన నిరంకుశ పాలన. ఈ సమయంలో నిజాం అనుచర రజాకార దళాలు మరింత క్రూరంగా వ్యవహరించాయి. 1947 చివరి నుండి 1948 వరకూ రజాకార్ల హింస తెలంగాణ గ్రామాలపై భయంకర ముద్ర వేసింది. గ్రామాలపై దాడులు, దహనాలు, లూటీలు, హత్యలు, మహిళలపై దౌర్జన్యాలు విస్తరించాయి. ఈ హింస ప్రజలను స్వీయరక్షణ దళాల వైపు నడిపించింది. 1947–1948 కాలం తెలంగాణ సాయుధ పోరాటం అత్యంత ఉధృత దశ. ఈ సమయంలో గ్రామ దళాలు, గెరిల్లా దళాలు, ప్రజా కమిటీలు ఏర్పడ్డాయి. అనేక గ్రామాల్లో "గ్రామ రాజ్యాలు" లేదా ప్రజా పాలనాత్మక నిర్మాణాలు వెలిశాయి. భూస్వాములు గ్రామాలు విడిచి పారిపోవాల్సిన పరిస్థితులు కొన్ని ప్రాంతాల్లో ఏర్పడ్డాయి. ప్రజలు స్వయంగా గస్తీ కాయడం, ధాన్యం సంరక్షించడం, మహిళల రక్షణ, న్యాయ వివాదాల పరిష్కారం, భూవిభజన వంటి అంశాల్లో పాత్ర పోషించారు. ఇది పోరాటానికి కేవలం ప్రతిఘటన గుణమే కాకుండా, ప్రత్యామ్నాయ ప్రజా పాలన స్వరూపం కూడా ఉన్నట్లు సూచిస్తుంది. ఈ పోరాటంలో మహిళల పాత్ర అసాధారణంగా ప్రస్తావించదగినది. వారు కేవలం బాధితులుగా నిలవలేదు; సందేశ రవాణాదారులుగా, ఆహార సరఫరాదారులుగా, కార్యకర్తలుగా, కొన్నిచోట్ల ఆయుధధారులుగా ముందుకు వచ్చారు. రాత్రి సంచారాలు, దళాల ఆశ్రయం, రహస్య సమాచార పరిరక్షణ, గాయపడిన యోధుల సంరక్షణలో మహిళలు కీలక పాత్ర పోషించారు. తెలంగాణ సాయుధ పోరాటం మహిళా భాగస్వామ్యానికి ఒక చారిత్రక ఉదాహరణగా నిలిచింది. అదే విధంగా దళితులు, పేద కౌలురైతులు, కూలీలు, గిరిజనులు కూడా పోరాటంలో ప్రధాన బలంగా నిలిచారు. అందువల్ల దీనిని కేవలం రాజకీయ నాయకుల పోరాటం అని కాకుండా, ప్రజల దిగువ తరగతుల చైతన్య విస్ఫోటనం అని కూడా విశ్లేషించాలి.

1948 సెప్టెంబర్‌లో భారత ప్రభుత్వం "పోలీస్ యాక్షన్" పేరుతో హైదరాబాదు సంస్థానంపై సైనిక చర్య చేపట్టింది. అధికారికంగా దీనిని "ఆపరేషన్ పోలో" అని పిలుస్తారు. 1948 సెప్టెంబర్ 13 నుండి 17 వరకు సాగిన ఈ చర్యతో నిజాం పాలన ముగిసింది. హైదరాబాదు సంస్థానం భారతసంఘంలో విలీనం అయింది. ఈ సంఘటనతో తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొందినా, తెలంగాణ సాయుధ పోరాటం అక్కడితో పూర్తిగా ముగియలేదు. ఎందుకంటే పోరాట మూలాలు కేవలం నిజాం వ్యతిరేకతలోనే కాకుండా, భూస్వామ్య వ్యతిరేకతలో కూడా ఉన్నాయి. నిజాం పడిపోయిన తర్వాత కూడా అనేక ప్రాంతాల్లో భూమి, రైతు హక్కులు, స్థానిక దమనశక్తులపై పోరాటం కొనసాగింది. 1948 తర్వాత భారత ప్రభుత్వ సైన్యం, పోలీసులు, పరిపాలన యంత్రాంగం గ్రామీణ తెలంగాణలో సాయుధ దళాలపై దాడులు ప్రారంభించాయి. దీంతో పోరాటం మరో దశలోకి ప్రవేశించింది. 1949, 1950 సంవత్సరాల్లో కమ్యూనిస్టు నాయకత్వంలోని గెరిల్లా పోరాటం కొనసాగినప్పటికీ, రాష్ట్ర నిర్బంధం తీవ్రమైంది. గ్రామాల్లో కూంబింగ్ చర్యలు, అరెస్టులు, ఎన్‌కౌంటర్లు, చిత్రహింసలు పెరిగాయి. అయినప్పటికీ, పోరాటం కొన్ని ప్రాంతాల్లో నిలిచింది. ఈ కాలంలో సాయుధ దళాలు అడవులు, కొండప్రాంతాలకు వెళ్లి గెరిల్లా ధోరణిలో కొనసాగాయి. 1951 సంవత్సరం తెలంగాణ సాయుధ పోరాటానికి ముగింపు దశగా గుర్తించబడుతుంది. భారత కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మక మార్పుల నేపథ్యంలో సాయుధ పోరాటాన్ని ఉపసంహరించుకునే నిర్ణయం తీసుకుంది. 1951 అక్టోబర్ నాటికి పోరాటం అధికారికంగా విరమించబడింది. అయితే పోరాటం ఆగిపోయినా, దాని రాజకీయ, సామాజిక ప్రభావం తెలంగాణ సమాజంలో శాశ్వత ముద్ర వేసింది. ఈ పోరాటం కారణంగా వేలాది గ్రామాల్లో వెట్టిచాకిరి వ్యవస్థకు తీవ్ర దెబ్బతగిలింది. భూస్వాముల దౌర్జన్యానికి సవాలు ఏర్పడింది. భూమి విషయంలో రైతులకు హక్కులపై అవగాహన పెరిగింది. గ్రామీణ పేదల్లో ఆత్మగౌరవం పెరిగింది. ప్రజలు కలిసి పోరాడితే అధికారం కదులుతుందని తెలంగాణ చరిత్ర రుజువు చేసింది.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని సంవత్సరాల వారీగా చూడడం అవసరం. 1921లో ఆంధ్ర జనసంఘం ఆరంభం సామాజిక చైతన్యానికి తొలి సంస్థాగత సంకేతం. 1930లలో ఆంధ్ర మహాసభ విస్తరణ ప్రజా చైతన్యానికి కొత్త మార్గం. 1939–1944 మధ్య వామపక్ష భావజాల ప్రవేశం గ్రామీణ సమస్యలను రాజకీయీకరించింది. 1944–1945లో రైతు సంఘాల ఏర్పాటుతో పోరాట పునాది బలపడింది. 1946లో దొడ్డి కొమరయ్య హత్యతో సాయుధ దిశకు మలుపు తిరిగింది. 1947లో భారత స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ విముక్తి రాకపోవడంతో పోరాటం ఉధృతమైంది. 1947–1948లో రజాకార్ల హింసకు ప్రతిగా గ్రామ గెరిల్లా దళాలు ఎదిగాయి. 1948 సెప్టెంబర్‌లో ఆపరేషన్ పోలోతో నిజాం పాలన ముగిసింది. 1948–1951 మధ్య భూస్వామ్య వ్యతిరేక దశలో పోరాటం కొనసాగింది. 1951లో ఉపసంహరణతో సాయుధ దశ ముగిసింది. ఈ క్రమాన్ని అర్థం చేసుకుంటే "వీర తెలంగాణ" అనేది కేవలం ఒక భావోద్వేగ నినాదం కాదని, అది నిరంతర ప్రజా ప్రతిఘటనకు చారిత్రక గుర్తింపని స్పష్టమవుతుంది. ఈ పోరాటం సాధించిన ముఖ్య ఫలితాలలో భూవిభజన ప్రశ్నను ప్రజా చర్చలోకి తెచ్చిన అంశం అత్యంత ముఖ్యమైనది. సాగు చేసేవారికే భూమి హక్కు ఉండాలి అనే నినాదం భవిష్యత్ భూసంస్కరణలకు మార్గదర్శక సూత్రంగా మారింది. గ్రామాల్లో భూస్వాముల సంపూర్ణ ఆధిపత్యం సడలింది. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పెద్ద స్థాయి సామాజిక తిరుగుబాటు జరిగింది. మహిళలు ప్రజా రాజకీయాలలో భాగస్వాములు కావచ్చని స్పష్టమైంది. గ్రామీణ ప్రజల్లో స్వీయరక్షణ, సంఘటిత శక్తి, సమానత్వ భావన బలపడింది. అయితే ఈ పోరాటం పరిమితులను కూడా చరిత్ర పరిశీలిస్తుంది. అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. కొన్ని చోట్ల హింస తీవ్రత సామాన్య ప్రజలపై భారమైంది. జాతీయ రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత వ్యూహభేదాలు, ప్రభుత్వ సైనిక నిర్బంధం వల్ల దీర్ఘకాలిక ప్రజా పాలన నిర్మాణాలు నిలవలేదు. అయినప్పటికీ, దాని మూలస్వరూపం ప్రజా న్యాయ పోరాటమే అన్న విషయం చరిత్రకారుల విశ్లేషణల్లో ప్రధానంగా నిలుస్తుంది. "వీర తెలంగాణ" అనే పదబంధం అందుకే ఒక ప్రాంతానికి పెట్టిన అలంకార నామం కాదు. అది అణచివేతను ఎదిరించిన ధైర్యానికి, రైతాంగ తిరుగుబాటుకు, సామూహిక త్యాగానికి, భూమి కోసం బలిదానానికి లభించిన ప్రజా బిరుదు. ఈ పోరాటంలో వేలాది మంది రైతులు, కూలీలు, మహిళలు, కార్యకర్తలు జైలు పాలయ్యారు; అనేక మంది ప్రాణత్యాగం చేశారు. వారి త్యాగం తెలంగాణ జ్ఞాపక సంస్కృతిలో పాటలుగా, జానపద కథలుగా, స్మృతులుగా, రాజకీయ చర్చలుగా నిలిచిపోయింది.

తరువాతి దశల్లో 1969 తెలంగాణ ఉద్యమం నుండి 2000ల రాష్ట్ర హక్కుల ఉద్యమం వరకు తెలంగాణ స్వీయగౌరవ చర్చల్లో కూడా ఈ సాయుధ పోరాటం స్ఫూర్తిగా నిలిచింది. "వీర తెలంగాణ" అనే భావన ప్రజల ప్రతిఘటన చరిత్రకు మానసిక బలంగా పనిచేసింది. అంటే, 1946–1951 పోరాటం ముగిసినా దాని ఆత్మ కొనసాగింది. అది తెలంగాణను కేవలం భౌగోళిక యూనిట్‌గా కాకుండా, పోరాటపూర్వక చరిత్ర కలిగిన సామాజిక స్థలంగా నిలిపింది. మొత్తానికి తెలంగాణ ప్రజల సంఘటిత సాయుధ పోరాటమే "వీర తెలంగాణ" అనే పేరుకు సారాన్ని ఇచ్చింది. ఈ పోరాటం నిజాం నిరంకుశ పాలనను, రజాకార్ల హింసను, సామంత దోపిడీని సవాలు చేసింది. 1946 నుండి 1951 వరకు సాగిన ఈ మహత్తర రైతాంగ విప్లవోద్యమం భారత చరిత్రలో ప్రజా శక్తి ఏమి సాధించగలదో చూపించింది. అందుకే తెలంగాణ చరిత్రలో ఇది ఒక అధ్యాయం మాత్రమే కాదు; అది తెలంగాణ ఆత్మను నిర్వచించిన యుగం. భూమి, గౌరవం, హక్కులు, స్వేచ్ఛ కోసం సంఘటిత ప్రజలు ఎగిసిపడినప్పుడు ఒక ప్రాంతం ఎలా "వీర తెలంగాణ"గా రూపాంతరం చెందుతుందో ఈ చరిత్ర మనకు స్పష్టంగా నేర్పుతుంది. "వీర తెలంగాణ" అనే పదం ఒక సాధారణ ప్రాంతీయ విశేషణం కాదు; అది చరిత్రలో రక్తాక్షరాలతో లిఖితమైన ప్రజా పోరాట గాథకు సమాజం సమర్పించిన గౌరవసూచకం. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఈ పేరుకు అంతర్భావాన్ని, ఆత్మను, చారిత్రక న్యాయాన్ని ఇచ్చింది. నిజాం నిరంకుశ పాలన, జాగీర్దారీ–సామంత దోపిడీ, వెట్టిచాకిరి, బలవంతపు వసూళ్లు, మానవ గౌరవాన్ని అవమానించే గ్రామీణ శక్తి నిర్మాణాలపై సాధారణ ప్రజలు ఒకేసారి తిరుగుబాటు చేసినప్పుడు, తెలంగాణ భౌగోళిక పరిమితిని దాటి చరిత్రలో ఒక ప్రజా ప్రతిఘటన చిహ్నంగా మారింది. అందుకే "వీర తెలంగాణ" అనే పదం వెనుక ఉన్న మౌలిక అర్థం, శౌర్యం కంటే ఎక్కువ; అది సంఘటిత ప్రజా చైతన్యం, సామూహిక త్యాగం, సామాజిక న్యాయం కోసం సాగిన చారిత్రక దిశాబోధ.

1946 నుండి 1951 వరకు సాగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని పరిశీలించినప్పుడు, ఇది కేవలం ఆయుధాలతో సాగిన తిరుగుబాటు కాదని స్పష్టమవుతుంది. ఇది ఒక సమాజం తనపై



రుద్దబడిన అన్యాయ క్రమాన్ని తిరస్కరించిన క్షణం. ఇది ఒక రైతు తన చెమటతో పండించిన పంటపై తనకూ హక్కు ఉందని ప్రకటించిన దశ. ఇది ఒక కూలీ తన శ్రమ ఉచితం కాదని, తన మనిషితనానికి ధర ఉందని ప్రపంచానికి తెలియజేసిన సందర్భం. ఇది ఒక దళితుడు తన అవమానిత జీవితం శాశ్వతం కాదని, తనకూ గౌరవంగా బతికే హక్కు ఉందని చరిత్ర ముందు నిలిపిన సవాలు. ఇది ఒక మహిళ ఇంటి గడప దాటి ఉద్యమ చరిత్రలో భాగస్వామి అయిన ఘట్టం. అందువల్ల తెలంగాణ సాయుధ పోరాటం సామాజిక వర్గాల మధ్య సంబంధాలను కదిలించిన మహత్తర పరివర్తన ప్రక్రియగా కూడా అర్థం చేసుకోవాలి. ఈ పోరాటం మనకు నేర్పిన అతిపెద్ద సత్యం ఏమిటంటే, అణగారిన ప్రజలు అసంఘటితంగా ఉన్నంత కాలం శోషణ వ్యవస్థలు శాశ్వతంగా కనిపిస్తాయి; కానీ అదే ప్రజలు చైతన్యంతో, లక్ష్యంతో, ఐక్యతతో ముందుకు వస్తే చరిత్ర దిశనే మార్చగలరు. నిజాం పాలన అప్పుడు ఎంతటి బలమైన వ్యవస్థలా కనిపించినా, గ్రామీణ ప్రజల సంకల్పం ఎదుట అది చివరికి నిలవలేకపోయింది. అదే విధంగా సామంత దోపిడీ కూడా శాశ్వతం కాదని తెలంగాణ రైతాంగం నిరూపించింది. ఇక్కడే "వీర తెలంగాణ" అనే భావనకు అసలు బలం ఉంది. అది కత్తి పట్టిన చేతిలో మాత్రమే లేదు; అది ఒకరికొకరు తోడుగా నిలిచిన గ్రామ ప్రజల మనోబలంలో ఉంది. అది గెరిల్లా దళాల్లో మాత్రమే లేదు; అది వెట్టి చేయనని చెప్పిన కూలీ గొంతులో ఉంది. అది సభామండపాల్లో మాత్రమే లేదు; అది పొలం అంచున న్యాయం కోరిన రైతు అడుగులో ఉంది. తెలంగాణ సాయుధ పోరాటం యొక్క ప్రాముఖ్యతను కేవలం ఆ కాలపు రాజకీయ పరిణామాల వరకే పరిమితం చేయలేం. దాని ప్రభావం తదనంతర దశల్లోనూ స్పష్టంగా కనిపిస్తుంది. భూమి సమస్యపై ప్రజా చర్చకు ఇది బలమైన పునాది వేసింది. వెట్టిచాకిరి వంటి అమానుష సామాజిక నిర్మాణాలపై సామూహిక వ్యతిరేకతకు దిశ చూపింది. గ్రామీణ సమాజంలో అధికారం ఒక్క వర్గానికి శాశ్వత సొత్తు కాదని, ప్రజా ప్రతిఘటన దానిని సవాలు చేయగలదని వెల్లడించింది. భవిష్యత్ తెలంగాణ రాజకీయ చైతన్యంలోనూ, ప్రాంతీయ స్వాభిమాన ఆలోచనలోనూ, సామాజిక న్యాయ చర్చలలోనూ ఈ పోరాటం ఒక అంతర్గత శక్తిగా నిలిచింది. 1969 తెలంగాణ ఉద్యమం నుండి ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు వచ్చిన స్వీయగౌరవ ధోరణుల వెనుక కూడా ఈ చారిత్రక స్మృతి ఒక మౌన శక్తిలా పనిచేసింది.

అయితే ఈ చరిత్రను కేవలం వీరగాథగా మాత్రమే చూడటం సరిపోదు; దాని అంతరార్థాన్ని లోతుగా గ్రహించాలి. తెలంగాణ సాయుధ పోరాటం మనకు చెబుతుంది – స్వేచ్ఛ అనేది కేవలం అధికార మార్పు కాదు. పాలకుడు మారినా, శోషణ నిర్మాణాలు అలాగే ఉంటే ప్రజలకు నిజమైన విముక్తి రాదు. 1948లో నిజాం పాలన ముగిసినా, పోరాటం వెంటనే ఆగిపోకపోవడం ఈ విషయానికి గొప్ప చారిత్రక సాక్ష్యం. ప్రజలు నిజాం వ్యతిరేకంగా మాత్రమే కాదు; భూస్వామ్య వ్యతిరేకంగా కూడా పోరాడారు. అంటే వారి లక్ష్యం ఒక వ్యక్తి లేదా ఒక పాలక శక్తి పరాజయం మాత్రమే కాదు; అన్యాయ సామాజిక వ్యవస్థల రూపాంతరం. ఈ అంశం తెలంగాణ సాయుధ పోరాటాన్ని సాధారణ రాజకీయ తిరుగుబాట్ల కంటే ఉన్నత స్థాయిలో నిలబెడుతుంది. ఈ పోరాటానికి సంబంధించిన మరో గాఢమైన బోధ ఏమిటంటే, చరిత్రలో పేరుపొందిన నాయకులే మార్పు సృష్టించరు; తెలియని వేలాది సామాన్యులే అసలు చరిత్ర నిర్మాతలు. తెలంగాణలో కూడా అదే జరిగింది. పాఠ్యపుస్తకాల్లో కొందరి పేర్లు మాత్రమే కనిపించినా, వాస్తవానికి ఈ ఉద్యమాన్ని మోసింది పేరులేని రైతులు, కూలీలు, మహిళలు, గ్రామ యువకులు, గిరిజనులు, దళితులు, చిన్న కార్యకర్తలే. వారి బాధలు ఈ ఉద్యమానికి బీజం కాగా, వారి త్యాగాలు దీనికి శక్తి అయ్యాయి. కాబట్టి "వీర తెలంగాణ" అనగానే మనం గుర్తు పెట్టుకోవాల్సింది కొద్దిమంది నాయకులను మాత్రమే కాదు; చరిత్రలో గుర్తింపుకోసం కాకుండా న్యాయం కోసం జీవించిన ఆ సామాన్యులను కూడా. వారి సంగ్రామమే ఈ నేలను వీరభూమిగా మలిచింది. తెలంగాణ సాయుధ పోరాటం ఒక ప్రాంతపు చరిత్ర అయినా, దాని సందేశం విశ్వమానవీయ స్వరూపం కలిగినది. ఎక్కడైనా భూమి లేకుండా శ్రమించే వర్గం ఉంటే, ఎక్కడైనా శ్రమ ఫలితాన్ని ఇతరులు దోచుకుంటే, ఎక్కడైనా గౌరవం లేని జీవితం ప్రజలపై రుద్దబడితే, అక్కడ తెలంగాణ పోరాటం ప్రాసంగికమే. అది మనకు గుర్తు చేస్తుంది --- అన్యాయం ఎంత పాతదైనా అది సహజం కాదు; శోషణ ఎంత బలంగానైనా అది అజేయం కాదు; ప్రజలు ఎంత బలహీనంగా కనిపించినా, వారి ఐక్యత చరిత్రలో అత్యంత శక్తివంతమైన బలంగా మారగలదు. ఈ సార్వత్రిక సత్యమే తెలంగాణ పోరాటాన్ని కేవలం ప్రాదేశిక చరిత్ర నుండి మానవ విముక్తి గాథ స్థాయికి తీసుకెళ్తుంది.

నేటి తరానికి ఈ పోరాటం ఇవ్వగల సందేశం కూడా అత్యంత విలువైనది. ఈ చరిత్రను స్మరించటం అంటే గతాన్ని పొగడటం మాత్రమే కాదు; నేటి సమాజాన్ని అర్థం చేసుకోవడం కూడా. భూమి, వనరులు, గౌరవం, సమానత్వం, హక్కులు, పాలనలో భాగస్వామ్యం వంటి ప్రశ్నలు ఇప్పటికీ ప్రాసంగికంగా ఉన్నప్పుడు, తెలంగాణ సాయుధ పోరాటం ఒక చారిత్రక దర్పణంలా పనిచేస్తుంది. ప్రజాస్వామ్యం కేవలం ఓటుతో పరిమితం కాకూడదని, అది గ్రామస్థాయిలో న్యాయం, ఆర్థిక సమానత్వం, సామాజిక గౌరవం రూపంలో కనిపించాలనే భావనకు ఈ పోరాటం బలాన్నిస్తుంది. చరిత్రను తెలుసుకోవడం ద్వారా సమాజం తన వర్తమానాన్ని సరిచేసుకోగలదు; ఆ దిశలో తెలంగాణ పోరాటం ఒక శక్తివంతమైన పాఠశాల. ముఖ్యంగా "వీర తెలంగాణ" అనే పదాన్ని నేటి వాడుకలో కేవలం నినాదంగా మిగల్చకుండా, దాని వెనుక ఉన్న త్యాగం, కష్టాలు, ఆవేదన, ఆశయం, సామూహిక స్వప్నాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ఈ పేరు వెనుక వేలాది కుటుంబాల కన్నీరు ఉంది; తమ బతుకును పణంగా పెట్టిన పేదల గాథ ఉంది; అణచివేతను లొంగిపోకుండా ఎదిరించిన ప్రజా గౌరవం ఉంది. అందువల్ల ఈ చరిత్రను సంబరంగా మాత్రమే కాదు, బాధ్యతగా కూడా స్మరించాలి. ఆ పోరాటం కోరుకున్న సమానత్వం, న్యాయం, గౌరవం ఇంకా సంపూర్ణంగా సాధించబడలేదంటే, దాని స్ఫూర్తి ఇంకా అవసరమే. చరిత్రను జ్ఞాపకం చేసుకోవడం అంటే విగ్రహాలు కట్టడం కాదు; దాని విలువలను వర్తమానంలో నిలబెట్టడం. చివరకు చెప్పాలంటే, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే "వీర తెలంగాణ" అనే పేరుకు జీవం పోసిన మహా చారిత్రక శక్తి. ఇది ఒక యుద్ధ ఘట్టం మాత్రమే కాదు; ఒక సమాజం తన మనిషితనాన్ని తిరిగి సాధించుకోవడానికి చేసిన మహత్తర ప్రయత్నం. ఇది భూమి కోసం పోరాటం అయినంత మాత్రాన కాదు; గౌరవం కోసం చేసిన తిరుగుబాటు కూడా. ఇది పాలకులకు వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటన అయినంత మాత్రాన కాదు; శతాబ్దాలుగా స్థిరపడిన అన్యాయాన్ని తిరస్కరించిన సామూహిక మానవ ప్రకటన కూడా. అందువల్ల "వీర తెలంగాణ" అనేది గతస్మృతి కాదు; అది చైతన్యం. అది ఒక చారిత్రక సంఘటన కాదు; అది నిరంతర ప్రేరణ. తెలంగాణ నేలపై రక్తం చిందించిన ఆ ప్రజా యోధుల గాథ ఎప్పటికీ ఒక మాట చెబుతూనే ఉంటుంది – సంఘటిత ప్రజాశక్తికంటే గొప్ప శక్తి లేదు. అదే వీర తెలంగాణ అసలు సందేశం, అదే దాని చిరస్థాయి గౌరవం.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.